Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 207 మేడ్చల్ మల్కాజ్‌గిరి 17 ఆగష్టు 2023 గురువారం పేజీలు : 4

## వచ్చే నాలుగైదేళ్లలో అందరికీ ఉచితంగా విద్యుత్

న్యూఢిల్లీ: ఉచిత విద్యుత్ సరఫరాపై కేంద్ర సహాయ మంత్రి సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే నాలుగైదు ఏళ్లలో జమ్మూ కశ్మీర్‌లో సోలార్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయడం ద్వారా ఉచిత విద్యుత్తును అందించడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ చెప్పారు. ఈ నెలలో కశ్మీరులో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన కోసం భద్రత, ఇతర సంసిద్ధతను సమీక్షించడానికి కశ్మీర్ వచ్చిన మంత్రి మీడియాతో మాట్లాడారు. గందరగోళం నుంచి జమ్మూ కశ్మీర్ ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా మారుతుందని మంత్రి పేర్కొన్నారు. “మేం కశ్మీర్ ప్రాంతంలో గ్రామీణాభివృద్ధిలో కొత్త ఆవిష్కరణలు చేస్తామని, వ్యవసాయ స్టార్టప్‌లను ప్రోత్సహిస్తామని మంత్రి చెప్పారు. కశ్మీరులో రూ. 2.45 కోట్ల విలువైన సోలార్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసే పని రెండు రోజుల్లో పూర్తవుతుందని, దీని ద్వారా సోలార్ పవర్ ద్వారా విద్యుత్ అందిస్తామని మంత్రి ప్రకటించారు.



# సీట్ల కేటాయింపుపై ఆచితూచి..!

## ఫుల్ క్లారిటీతో కాంగ్రెస్ హైకమాండ్

## మూడు జిల్లాల్లో సర్వే అయిపోయిందా ?

హైదరాబాద్ : తొందరలోనే జరగబోయే తెలంగాణా ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికపై ఏఐసీసీ కసరత్తును స్పీడ్ పెంచేసింది. ఏఐసీసీ తరపున ప్రతి నియోజకవర్గానికి పరిశీలకులను నియమించింది. వీరంతా రంగంలోకి దిగేశారు. పార్టీ ద్వితీయశ్రేణి నేతలతోను, క్యాడర్ తోనే కాకుండా వివిధ రంగాల్లోని వాళ్ళతో మంతనాలు మొదలుపెట్టేశారు. అభ్యర్థుల ఎంపికకు సంబంధించి అదనంగా టెలికాలర్స్ సేవలను కూడా ఉపయోగించుకుంటున్నారు. వచ్చేనెలలో మొదటి జాబితాను ప్రకటించాలన్నది పీసీసీ, ఏఐసీసీ నేతల ఉద్దేశ్యం. అందుకనే అవసరమైన కసరత్తులో జోరు పెంచింది. ఇప్పటికే మహబూబ్ నగర్, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో సర్వే రిపోర్టులు రెడీ అయిపోయినట్లు సమాచారం. ఈ జిల్లాకు కేటాయించిన అబ్జర్వర్లు తమకిచ్చిన బాధ్యతలను పూర్తిచేశారట. మిగిలిన పరిశీలకులు కూడా తమకిచ్చిన నియోజకవర్గాల్లో సర్వేలను పూర్తి చేయబోతున్నారు. ఈ నెలాఖరుకల్లా అన్ని సర్వేలు పూర్తియపోతాయని కాంగ్రెస్ అధిష్టానం అంచనా వేసింది. ఒక్కో జిల్లాకు 17 మంది పరిశీలకులను అధిష్టానం నియమించింది. ఒక్కో నియోజకవర్గంలో ను పోటీ చేయడానికి ముగ్గురు, నలుగురు నేతలు పోటీలు పడుతున్నారు. సిట్టింగులు, సీనియర్లున్న కొన్ని నియోజకవర్గాల్లో మాత్రమే పెద్దగా పోటీలేదు. అంటే ఇలాంటి నియోజకవర్గాలు సుమారు ఒక 45 వరకు ఉంటాయట.

మిగిలిన అన్నీ నియోజకవర్గాల్లో సీనియర్ల మధ్య పెద్ద పోటీయే నడుస్తోందని పార్టీ వర్గాలు చెప్పాయి. అందుకనే పోటీపడుతున్న వాళ్ళల్లో ఎవరికి గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే విషయాన్ని క్షేత్రస్థాయిలో తిరిగి తెలుసుకునేందుకే పరిశీలనకులను నియమించింది. పరిశీలకులు తమ సర్వేను పూర్తి చేయగానే ఒక జాబితాను తయారు చేసి, తమ అభిప్రాయాలతో ప్రాయరిటి జాబితాను ఏఐసీసీకి అందించబోతున్నారు. వీళ్ళ సిఫార్సులు, పీసీసీ నుండి వచ్చిన జాబితా, రాజకీయ వ్యూహకర్తల రిపోర్టును దగ్గర పెట్టుకుని టికెట్లు ఎవరికి ఇవ్వాలనే విషయంలో ఏఐసీసీనే నిర్ణయం తీసుకోబోతున్నది. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి బలమైన వ్యతిరేక గ్రూపు రెగ్యులర్ గా పనిచేస్తోంది. అందుకనే గ్రూపుల ప్రభావం వల్ల పార్టీ విజయావకాశాలు దెబ్బతినకూడదన్నది అధిష్టానం ఆలోచన. అందుకనే ప్రత్యేకించి పరిశీలకులు అని నియోజకవర్గాలకు నేతలను పంపింది. మరి ఇన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా చివరకు ఫలితం ఎలాగుంటుందో చూడాల్సిందే.




## కాంగ్రెసోళ్ల మాటలు నమ్మొద్దు

నిజామాబాద్: బీఆర్ఎస్ అంటే ఇంటి పార్టీ అని ఆ పార్టీ ఎమ్మెల్సీ కవిత అన్నారు. బోధన్‌లో జరిగిన బహిరంగ సభలో కవిత మాట్లాడారు. తెలంగాణలో గులాబీ విప్లవం వచ్చిందన్నారు. హైదరాబాద్‌లో ప్రతీ కులానికి ఆత్మగౌరవ భవనం కట్టామని తెలిపారు. అలాగే ప్రతీ మతానికి సంబంధించిన పండుగలు ఘనంగా చేస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా ప్రతీ ఇంటికి పథకం వచ్చిందని చెప్పుకొచ్చారు. నిజామాబాద్‌లో ఐటీ హబ్ పెట్టి వందలాది మందికి ఉద్యోగాలు ఇప్పించుకున్నామని తెలిపారు.

కాంగ్రెస్ పాలనలో ఇరిగేషన్ శాఖామంత్రిగా ఉన్న సుదర్శన్ రెడ్డి ఒక్క ప్రాజెక్టైనా తెచ్చారా? అని ప్రశ్నించారు. ఆయనో వ్యాపారి అని.. కానీ షకీల్ మాత్రం ఓ సాధారణ కార్యకర్త అని వివరించారు. బోధన్‌లో సీనియారిటీకి, సిన్సియారిటీకి మధ్య పోటీ నెలకొందని పేర్కొన్నారు. గులాబీ కండువా కప్పుకున్నోళ్లు తిరగబడితే మీరెక్కడా తిరగలేరన్నారు. 24 గంటల కరెంట్ ఇస్తున్న కేసీఆర్ కావాలా? మూడు గంటలే ఇస్తామన్న కాంగ్రెస్ కావాలో తేల్చుకోవాలని ప్రజలను కోరారు. రాహుల్ గాంధీ యాత్ర చేస్తే ఏం లాభం.. 60 ఏళ్లు ఏం చేయలేని వారు ఇప్పుడేం చేస్తారని కవిత నిలదీశారు.

## బతుకమ్మ చీరలు రెడీ అవుతున్నాయా ?



సిరిసిల్ల : ఓటర్లను ఆకట్టుకోవడానికి వెయ్యి మార్గాలు. ఏ మార్గం సక్సెస్ అవుతుందో తెలీక రాజకీయ నేతలు నానా అవస్థలు పడుతున్నారు. ఇపుడు విషయం ఏమిటంటే బతుకమ్మ పండుగ సందర్భంగా కేసీయార్ ప్రభుత్వం చీరలు పంపిణీ చేయటం అందరికీ తెలిసిందే. మామూలుగా అయితే అక్టోబర్లో పండుగ సందర్భంగా చీరల పంపిణీ జరుగుతుంది. ఈసారి చీరల పంపిణీకి ఎన్నికల కోడ్ అడ్డు వస్తుందని అనుకున్నట్లున్నారు. అందుకనే నెలరోజుల ముందే బతుకమ్మ పండుగ పేరుతో చీరల పంపిణీకి ప్రభుత్వం రెడీ అయిపోతోంది. అక్టోబర్లో ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతుందని అనుకుంటున్నారు. అందుకనే సెప్టెంబర్ నెలలోనే చీరలను పంపిణీ చేయటంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇందులో భాగంగానే ఇప్పటికే 30 లక్షల చీరలను రెడీ చేసింది. మరో 20 లక్షల చీరలు రెడీ అవుతున్నాయి. మొత్తం మీద కోటి చీరల దాకా పంపిణీ చేయాలని ప్రభుత్వం టార్గెట్ గా పెట్టుకుంది. నిజానికి బతుకమ్మ పండుగ పేరుతో చీరల పంపిణీ అన్నది దండగమారి ఖర్చే. కేసీఆర్ ముఖ్యమంత్రి కాకముందు కూడా బతుకమ్మ పండుగను జనాలందరు బాగానే చేసుకునేవారు. అయితే అప్పట్లో ఏ ప్రభుత్వం కూడా ప్రత్యేకించి ఎవరికీ చీరలను పంపిణీ చేయలేదు. చీరల పంపిణీ అన్నది కేసీఆర్ కూతురు కల్వకుంట్ల కవిత జాగృతి సంస్థ తో మొదలైంది. తన సంస్థను పాపులర్ చేయటానికి, వ్యక్తిగతంగా ఇమేజి పెంచుకునేందుకే కవిత చీరల పంపిణీ మొదలుపెట్టారు. అప్పటినుండి ప్రభుత్వానికి చీరల ఖర్చులు మొదలైంది. సరే పంపిణీ చేస్తున్నవి చేనేత చీరలే కాబట్టి కనీసం ఏదో రూపంలో చేనేతలకు మంచి జరుగుతోంది కదాని ఎవరూ ఖర్చుల గురించి పట్టించుకోవటంలేదు. ప్రభుత్వం నుండి ఆర్డర్లు రాగానే సిరిసిల్ల ప్రాంతంలోని నేతన్నలు పనులు మొదలుపెట్టేసి బిజీ అయిపోయారు. ఆర్డర్ల ప్రకారం చీరలను రెడీచేయటానికి, పంపిణీకి నేతన్నలు మూడు షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. సుమారు 15 వేలమంది నేతన్నలు 25 వేల మగ్గాల మీద పనిచేస్తున్నారు.

అక్టోబర్ 15వ తేదీనుండి బతుకమ్మ సంబురాలు మొదలవుతాయి. ఈలోగానే అంటే సెప్టెంబర్ చివరికల్లా చీరల పంపిణీ అయిపోవాలన్నది ప్రభుత్వం టార్గెట్. 240 డిజైన్లలో చీరలు నేయటానికి ప్రభుత్వం 350 కోట్ల రూపాయలు ఖర్చుచేస్తోంది.

# పీఠంకోసం పాకులాట!

## ‘ఇండియా’ కూటమి కట్టినా...

## ‘పవర్’ కోసం ‘పన్నాగాలు’



నరేంద్రమోడీ నాయకత్వంలోని ఎన్డీయేని ఓడించటమే ఏకైక లక్ష్యంతో ఏర్పడిన ఇండియా కూటమిలో పీఠంకోసం పాకులాట మొదలైనట్లే ఉంది. నిజానికి ప్రతిపక్షాల్లోని 24 పార్టీలు కలిసి ఒక కూటమిగా ఏర్పడాలంటే పార్టీల అధినేతలకు త్యాగగుణం అన్నది చాలా అవసరం. పదవులను, సీట్లను త్యాగం చేయగలిగినపుడే ఐక్యత అన్నది పటిష్టంగా ఉంటుంది. ఇక్కడ విషయం ఏమిటంటే నరేంద్రమోడీని గద్దె దింపటమే ఏకైక లక్ష్యంతో అన్ని పార్టీలు కలిసాయి. కాంగ్రెస్ తో పాటు తృణమూల్ కాంగ్రెస్, ఆర్జేడీ, జనతాదళ్, ఎన్సీపీ లాంటి పార్టీలన్నీ బాధిత పార్టీలే. అందుకనే అర్జంటుగా ప్రతిపక్షాలు ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ చెప్పగానే అంగీకరించాయి. రెండుమూడుసార్లు విడివిడిగా అందరితో నితీష్ భేటీ అయిన తర్వాత ముందు పాట్నాలోను తర్వాత బెంగుళూరులోను భేటీ జరిగింది. అయితే ఇక్కడే సమస్య కూడా మొదలైందట. ఇండియా కూటమి తరపున ప్రధానమంత్రి అభ్యర్ధి ఎవరు అనే పాయింట్ చాలా కీలకమైంది.

కాంగ్రెస్సేమో ప్రధానమంత్రి పదవి తమకు అంత ప్రాధాన్యత అయినది కాదని ప్రకటించేసింది. అయితే మిగిలిన పార్టీలు ఇలా ప్రకటించలేదు. నితీష్ కుమార్ అయితే ముస్లింల ఓటుబ్యాంకును కన్సాలిడేట్ చేయటం కోసం రాష్ట్రంలో యాత్ర చేస్తున్నారు. దాంతో దేశవ్యాప్తంగా ఉన్న ముస్లింలంతా నితీష్ వెంట నిలబడాలని ఆ పార్టీ నేతలు ప్రచారం మొదలుపెట్టారు. అంటే పరోక్షంగా తానే ప్రధానమంత్రి అభ్యర్ధిని అని నితీష్ చెబుతున్నట్లే ఉంది.

అందుకనే సడెన్ గా బెంగాల్ సీఎం మమతాబెనర్జీ కూడా రంగంలోకి దూకారు. మమతానే ప్రదానమంత్రి అభ్యర్ధిగా తృణమూల్ కాంగ్రెస్ నేతలు బహిరంగంగా ప్రకటించారు. పార్టీ సోషల్ మీడియా ద్వారా అలాగే ప్రచారం చేయాలని డిసైడ్ చేశారు. ఇక ఈ పీఠంపై దశాబ్దాలుగా కన్నేసిన ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ ఉండనే ఉన్నారు. తనను ప్రధాని అభ్యర్ధిగా ప్రకటించకపోతే ఎన్డీయేలోకి వెళిపోతాననే సంకేతాలను పరోక్షంగా ఇస్తున్నారు.

దీంతో ఇండియాకూటమి ఏర్పడినా ప్రధానమంత్రి అభ్యర్ధి అన్న చిక్కుముడి బాగా పెరిగిపోతున్నట్లుంది. బహుశా రాబోయే ఐదురాష్ట్రాల ఎన్నికలే ఈ ప్రశ్నకు సమాధానం చెబుతుందేమో.

# సంపాదకీయం

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజాకోర్టులా ?

బీఆర్ఎస్ ను ఓడించేందుకు తెలంగాణా కాంగ్రెస్ సరికొత్త నినాదాన్ని కాయిన్ చేయబోతోంది. ఇంతకీ అదేమిటంటే 'తిరగబడదాం-తరిమికొడదాం' అని. కేసీయార్ పాలన మీద తిరగబడతాం..కేసీఆర్ ప్రభుత్వాన్ని తరిమికొడదాం అనే నినాదంతో కాంగ్రెస్ నేతలు రాజకీయం చేయబోతున్నారు. కర్ణాటక ఎన్నికల్లో సాధించిన ఘనమైన విజయంతో తెలంగాణా కాంగ్రెస్ రెచ్చిపోతున్న విషయం అందరు చూస్తున్నదే. ఎన్నికల్లో మంచి నినాదాలు జనాలను చాలా తొందరగా ఆకట్టుకుంటాయన్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే కేసీయార్ ప్రభుత్వాన్ని, పాలనను ఉద్దేశించి లిలితిరగబడదాం..తరిమికొడదాంలిలి అనే స్లోగన్ మొదలుపెట్టింది. అలాగే ప్రతి నియోజకవర్గంలో కేసీఆర్ పాలనపై ప్రజాకోర్టులను నిర్వహించాలని కూడా డిసైడ్ చేసింది. నిజానికి ప్రజాకోర్టులన్నది మావోయిస్టుల వ్యవహారం అని అందరికీ తెలిసిందే. ప్రజాప్రతినిధుల వ్యవహారశైలి మీద జనాల్లో బాగా వ్యతిరేకత వచ్చేసినపుడు మావోయిస్టులు సీన్లోకి ఎంటరవుతారు. అప్పుడు సదరు ప్రజాప్రతినిధిని దొరికించుకుని లేదా ఆ ప్రజా ప్రతినిధికి ప్రతినిధిగా ఎవరినో పట్టుకుని జనాల మధ్య నిలబెట్టి పంచాయితి చేస్తారు. సదరు ప్రజాప్రతినిధి చేసిన తప్పులను ప్రజాకోర్టులో విచారిస్తారు. అప్పుడు ప్రజాకోర్టులో ప్రజా ప్రతినిధిగా శిక్షకూడా విధిస్తారు. కొన్నిసార్లు చంపేస్తారు కూడా. ఇదంతా ఒకపుడు జరిగిన వ్యవహారం. ఇప్పుడు తెలంగాణాలో మావోయిస్తులు ఎక్కడా ప్రజాకోర్టులు నిర్వహించటంలేదు. అలాంటిది ఇపుడు కాంగ్రెస్ పార్టీ సడెన్ గా ప్రజాకోర్టుల నినాదంతో కార్యక్రమాల జోరును పెంచబోతోంది. అంటే మంత్రులు, బీఆర్ఎస్ ఎంఎల్ఏలు చేస్తున్న తప్పులు, పాల్పడుతున్న అవినీతిని జనాల్లో ఎండగట్టాలని కాంగ్రెస్ ప్లాన్ చేస్తోంది. మరి ఈ ప్రజాకోర్టుల కాన్సెప్ట ఎంతవరకు సక్సెస్ అవుతుందో తెలీదు. ఎందుకంటే ప్రజాకోర్టుల పేరుతో కాంగ్రెస్ నిర్వహించాలని అనుకుంటున్న కార్యక్రమాన్ని పోలీసులు అనుమతించే అవకాశాలు దాదాపు లేవనేచెప్పాలి. ఎందుకంటే ప్రజాకోర్టు అనగానే ముందుగా అందరికీ మావోయిస్టులే గుర్తుకొస్తారు కాబట్టి. అసలీ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తే జనాలు వస్తారా అన్న అనుమానాలు కూడా పెరిగిపోతున్నాయి. కాబట్టి తాను నిర్వహించబోతున్న కార్యక్రమానికి కొత్తగా మరేదైనా పేరుపెట్టుకుంటే బాగుంటుందేమో ఆలోచిస్తే మంచిది. గాంధీభవన్లో జరగబోతున్న స్క్రీనింగ్ కమిటి సమావేశం ఏమి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

# కెసిఆర్ పాలనలో దేశమే అబ్బురపడేలా తెలంగాణలో అభివృద్ధి కొనసాగుతుందన్న మంత్రి మల్లారెడ్డి..

**అలియాబాద్ అంతా గులాబీమయం దిశగా అడుగులు వేస్తున్న మంత్రి మల్లారెడ్డి...**

**అత్యధిక ఓటర్లు కలిగిన అలియాబాద్ గ్రామం పై పెరిగిన ఫోకస్...**

**అలియాబాద్ గ్రామానికి చెందిన వివిధ పార్టీ నాయకులు, అలియాబాద్ గ్రామ ఉపసర్పంచ్ ప్రభాకర్ రెడ్డి తదితరులను బిఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి మల్లారెడ్డి...**

**రాష్ట్ర అభివృద్ధిని చూసి గ్రామ అభివృద్ధి కొరకే టిఆర్ఎస్ పార్టీలో చేరనన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు అలియాబాద్ గ్రామ ఉపసర్పంచ్ ప్రభాకర్ రెడ్డి..**









మేడ్చల్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి, విజయవంతంగా కొనసాగిస్తున్న ఎన్నో సంక్షేమ పథకాలను దేశంలోని ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తుండడం కెసిఆర్ ప్రభుత్వ విజయానికి సంకేతమని మంత్రి మల్లారెడ్డి అన్నారు. ఎన్నికల సమీపిస్తుండడంతో, ప్రభుత్వం అవలంబిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు మంత్రి మల్లారెడ్డి అధిక సమయం ప్రజలతోనే గడుపుతున్నారు. అందులో భాగంగానే బిఆర్ఎస్ పార్టీలో చేరికలు రోజురోజుకు పెరుగుతున్నాయి. బుధవారం అలియాబాద్ గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అలియాబాద్ గ్రామ ఉపసర్పంచ్ ప్రభాకర్ రెడ్డిని బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ తాను నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని, అలియాబాద్ గ్రామం మరింత అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలియాబాద్ గ్రామంలోని వివిధ పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు, బిఆర్ఎస్ పార్టీలో చేరడంతో, అలియాబాద్ గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా మంత్రి మల్లారెడ్డిని గజమాలతో సత్కరించారు. మంత్రి మల్లారెడ్డి ముందుగా అలియాబాద్ లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు అలియాబాద్ గ్రామ ఉపసర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, నర్సింహా, దేవేందర్, రాజేష్, అనిల్ కుమార్, బిక్షపతి, విష్ణు, రామస్వామితోపాటుగా భారీ ఎత్తున్న మహిళాలు, యువకులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. అలియాబాద్ గ్రామ ఉపసర్పంచ్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటు రైతులకు, అటు బడుగు బలహీన వర్గాల ప్రజల అభివృద్ధిని కాంక్షిస్తూ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, విజయవంతంగా కొనసాగిస్తుండటం, అంతేకాకుండా మంత్రి మల్లారెడ్డి ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండటం, అనునిత్యం అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటుండటంతో, తమ అలియాబాద్ గ్రామ అభివృద్ధిని కాంక్షిస్తూ తాము బిఆర్ఎస్ పార్టీలో చేరిన్నట్లుగా వారు తెలిపారు. గ్రామాల అభివృద్ధిని కాంక్షిస్తూ గతంలో ఏ ప్రభుత్వం చేయనటువంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను తెలంగాణ ప్రభుత్వ ప్రవేశపెట్టి, విజయవంతంగా కొనసాగిస్తోందని గ్రామ సర్పంచ్ గుర్క కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మహేందర్ రెడ్డి, ఎంపీపీ ఎల్లుబాయ్, జడ్పీటీసీ అనిత, మండల రైతు బంధు అధ్యక్షులు కమటం కృష్ణ రెడ్డి,స్థానిక ఎంపిటీసీలు, వార్డు సభ్యులు లింగంతోపాటుగా, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రజలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# చోటు.. లోటు




ఖమ్మం :పురపాలక కేంద్రాల్లోని యువతలో క్రీడా చైతన్యం నింపేందుకు ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభించిన క్రీడా ప్రాంగణాల ఏర్పాటు నత్తతో పోటీపడుతున్నాయి. నిబంధన ప్రకారం ప్రతి మున్సిపాలిటీలో వార్డుకో ప్రాంగణం ఏర్పాటు చేయాల్సి ఉండగా ఉమ్మడి జిల్లాలో ఎక్కడా ఆ పరిస్థితి లేదు. కొలువుదీరిన ఒకటీ అరా ప్రాంగణాలను పరిశీలిస్తే 'ఏదో ఓ బోర్డు పెట్టేశాం'.. అన్నట్లుగా ఉంది. ఖమ్మం నగరపాలకంతోపాటు అన్నిపురపాలకాల్లోనూ ఇదే దుస్థితి. ఒక్కో క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు రూ. 2 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు వెచ్చించే వీలుందని అధికారులు చెబుతున్నారు. ఖమ్మం కార్పొరేషన్‌లో ఎక్కువ చోట్ల బోర్డులకే పరిమితమైంది. మణుగూరులో ఒకచోట రూ. 12 లక్షల వ్యయంతో ప్రాంగణాన్ని అభివృద్ధి చేస్తున్నారు. కొత్తగూడెం, మధిరలో స్థల లభ్యత ప్రతికూలంగా మారింది.

సమస్య ఏంటి?పురపాలకాల్లో క్రీడా మైదానాల ఏర్పాటుకు స్థలాల కొరత తీవ్రంగా ఉంది. ప్రభుత్వ స్థలాల లభ్యత లేక పురోగతి కరవైంది. కొన్నిచోట్ల స్థలాలున్నా ఆక్రమణలో లేదా ఇతర వివాదాల్లో ఉంటోంది. వాటిని చక్కదిద్దే చర్యలకు అధికారులు పూనుకోవటం లేదు. గత్యంతరం లేక పాల్వంచలో ప్రభుత్వ పాఠశాలలు, కొత్తగూడెంలో ప్రగతి మైదానంలో ఏర్పాటు చేశారు. వైరా, మధిర, సత్తుపల్లిలో ప్రభుత్వ పాఠశాలలు, తహసీల్దార్ కార్యాలయాల్లో క్రీడా ప్రాంగణాల బోర్డులు పెట్టేసి చేతులు దులుపుకోవటం విశేషం.

ఇవి చేయాలి..
పురపాలకంలోని ప్రతి వార్డులోనూ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలి. క్రీడా మైదానాల్లో వాకింగ్ ట్రాక్, ఖోఖో, కబడ్డీ కోర్టులు, సింగిల్, డబుల్ బార్‌లు, లాగ్ జంప్, వాలీబాల్ సౌకర్యాలు కల్పించాలి. ఆహ్లాదంగా మొక్కలు నాటాలి.

ఇలా ఉంది..స్థలాలు దొరికన చోట ఇప్పటివరకు సింహభాగం బోర్డులను మాత్రమే ఏర్పాటు చేశారు. అక్కడక్కడా నామమాత్రపు పరికరాలు అమర్చారు. క్రీడా కోర్టులకు చెందిన ఇనుప స్టాండ్లను ఏర్పాటు చేస్తున్నారు. పచ్చదనం జోలికే పోవడం లేదు.

వైరాలో ప్రత్యేక పరిస్థితి..వైరా పురపాలకంలో ప్రత్యేక పరిస్థితి ఉంది. స్పోర్ట్స్ అథారిటీ నుంచి రూ. 60 లక్షలు మంజూరు కావడంతో మినీ ఇండోర్ స్టేడియం నిర్మిస్తున్నారు. ప్రస్తుత కలెక్టర్ వీపీ గౌతమ్ దీని నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. ఆయన సూచనలతో రెవెన్యూ, గురుకుల పాఠశాలల పక్కన ఉన్న రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలం సుమారు ఎకరం కేటాయించారు. బాస్కెట్‌బాల్, రన్నింగ్‌ట్రాక్, అథ్లెటిక్స్ విభాగాల క్రీడలు, క్రికెట్ కబడ్డీ వంటివి ఇక్కడ ఏర్పాటు చేయిస్తున్నారు. మినీ స్టేడియం అయినప్పటికి క్రీడా ప్రాంగణంగానే గుర్తించారు."క్రీడా ప్రాంగణాల ఏర్పాటులో స్థల లభ్యత ప్రధాన సమస్యగా ఉంది. కొన్నిచోట్ల స్థలాలున్నా వివాదాల్లో ఉండటం ఇబ్బందిగా మారింది."అనిత, వైరా పురపాలక కమిషనర్

# పనుల జాప్యం.. ప్రగతికి అవరోధం

సంగారెడ్డి : జిల్లాలో జడ్పీ నిధుల వినియోగం తీరిది.. జడ్పీ నిధులతో చేపట్టిన పనులు నత్త నడకను తలపిస్తున్నాయి. కేటాయించిన ఏడాదిలోపే నిధులను ప్రగతి పనులకు వినియోగించాలనే నిబంధనలు ఉన్నా.. జిల్లాలో రెండేళ్లుగా తీవ్ర జాప్యం నెలకొంది. 2020-21లో 56 పనులు, 2021-22లో 192 పనులు వివిధ దశల్లో ఉండటమే ఇందుకు నిదర్శనం. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలోపం, గుత్తేదారులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడమే ప్రధాన కారణమనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కథనం.

**ఇతర పథకాలకు మళ్లించడంతో..** జిల్లా పరిషత్, మండల పరిషత్‌లకు ప్రభుత్వం పలు రకాల పద్దుల కింద నిధులు కేటాయిస్తోంది. గత డిసెంబరులో జిల్లాకు భారీగా నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. ఆ తర్వాత జడ్పీ నుంచి రూ. 12 కోట్లు, మండల పరిషత్‌ల నుంచి రూ. 18కోట్లను 'మన ఊరు-మన బడి' పథకానికి మళ్లించారు. ఏడాది నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు ఒక్కపైసా మంజూరు కాలేదు. జడ్పీకి ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు రూ. 4.27 కోట్ల నిధులను స్పెషల్ మ్యాచింగ్ గ్రాంటు కింద నెలవారీగా కేటాయించారు. వాటిని ఖర్చు చేసేందుకు మార్గదర్శకాలు జారీ చేయలేదు. దీంతో ఈ నిధులు కోశాగారంలో మూలుగుతున్నాయి.

క్షేత్ర స్థాయిలో పరిస్థితి.. అందోలు మండలం అక్సాన్‌పల్లిలో అదనపు తరగతుల భవన నిర్మాణానికి రూ. 5లక్షలు కేటాయించారు. ప్రస్తుతం ఆయా పనులు పునాది స్థాయిలోనే ఉన్నాయి.

నాగల్‌గిద్ద మండలం శేరితండాలో సామాజిక భవన మరమ్మతులకు రూ. 5 లక్షలు విడుదల చేసినా పనులు ఇప్పటికీ చేపట్టలేదు.

అందోలు మండలం పోతిరెడ్డిపల్లిలో అంబేద్కర్ విగ్రహం నుంచి బేగరి కిష్టయ్య ఇంటి వరకు సీసీ డ్రెయిన్ నిర్మాణానికి రూ. 2 లక్షలు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు.

**మార్చి నెలాఖరు వరకు పూర్తి చేస్తాం..- సీహెచ్ ఎల్లయ్య, జడ్పీ సీఈవో**

జిల్లాలో జడ్పీ నిధుల ద్వారా చేపడుతున్న పనులను వేగవంతం చేస్తాం. ప్రతి నెలా ఆయా పనులపై సమీక్ష నిర్వహించి, బిల్లులు త్వరగా అందేలా ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు ఇస్తున్నాం. నిర్దేశించిన కాల పరిమితిలో పనులు చేపట్టకపోతే రద్దు చేస్తాం. వచ్చే మార్చి 31 నాటికి పనులన్నీ పూర్తి చేసేలా ముందుకు సాగుతాం.

## ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు

వేములవాడ: ఆటంకాలను అధిగమిస్తూ లాభాల బాటలో వెళుతున్న రామగుండం ఎరువుల కర్మాగారం(ఆర్ఎఫ్‌సీఎల్) ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి అడుగులు వేస్తోంది. సాధారణంగా ఏదేని కర్మాగారం వరుసగా మూడేళ్లు లాభాలను ఆర్జిస్తేనే ఆ తర్వాత నుంచి సామాజిక బాధ్యత(సి.ఎస్.ఆర్.)గా ప్రత్యేకంగా నిధులు కేటాయించి ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. లాభాలతో సంబంధం లేకుండా ఏటా ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి పనులు చేపట్టేలా 'ఎంటర్‌ప్రైజెస్ సోషల్ కమిట్మెంట్' పేరిట కేంద్రం మార్గదర్శకాలను జారీ చేసింది. దీని ప్రకారంగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.3.41 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలను ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అక్కడి నుంచి ఆమోదం రాగానే పనులు చేపట్టే అవకాశముంది. రామగుండం ఎరువుల కర్మాగారం ఆధ్వర్యంలో మొట్టమొదటి సారిగా ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి పనులు మొదలయ్యేందుకు మరో ఆరునెలల గడువు పట్టే అవకాశముందని పలువురు భావిస్తున్నారు. గత సంవత్సరం సామాజిక బాధ్యతగా సుమారు రూ. 50 లక్షలు కేటాయించినప్పటికీ వివిధ కారణాలతో వాటిని వినియోగించలేకపోయారు. సామాజిక బాధ్యతగా దశల వారిగా ఎరువుల కర్మాగారం పరిసరాల్లోని ప్రభావిత గ్రామాల అభివృద్ధికి సంస్థ యాజమాన్యం చర్యలు తీసుకోనుంది.

ప్రధాన సమస్యలు.. రూ.3.41 కోట్ల నిధులు

'ఎంటర్‌ప్రైజెస్ సోషల్ కమిట్మెంట్'లో భాగంగా రూ.3.41 కోట్ల అంచనాలతో ఎరువుల కర్మాగారం పరిసర ప్రాంతాల్లోని ఐదు ప్రధాన సమస్యల పరిష్కారానికి ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం రంగం సిద్ధం చేసింది. క్షేత్రస్థాయిలో ఆయా సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించిన అధికారులు ప్రతిపాదనలను సంస్థ కేంద్ర కార్యాలయానికి నివేదించారు. అక్కడి నుంచి అనుమతి రాగానే పనులు మొదలు పెట్టనున్నారు. ఎరువుల కర్మాగారానికి నీటిని సరఫరా చేయడం కోసం ఎల్కలపల్లిగేటు కాలనీలోని రోడ్డును తవ్వి పైపులైను వేశారు. దీంతో రోడ్డు శిథిలమైంది. తాత్కాలిక మరమ్మతులు చేపట్టినప్పటికీ స్థానికుల నుంచి గతంలో ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఎల్కలపల్లి గేటు కాలనీలో ఫెర్టిలైజర్ సీటీ టౌన్‌షిప్ చిన్న గేటు నుంచి అంబేడ్కర్ విగ్రహం మీదుగా సుమారు 900 మీటర్ల పొడవునా రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. పూర్తిగా శిథిలమైన వీర్లపల్లి రోడ్డుతో ఇక్కడి ప్రజలతో పాటు రామగుండం ఎరువుల కర్మాగారంలో పనిచేసే ఒప్పంద కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో సుమారు కిలోమీటరు పొడవునా వీర్లపల్లి రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదించారు. లక్ష్మీపురం, వీర్లపల్లిలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారు. వీటన్నింటికీ నిరంతరం రద్దీగా ఉండే జ్యోతినగర్‌లోని ఎఫ్.సి.ఐ. అడ్డరోడ్డు నుంచి ఫెర్టిలైజర్ సిటీ రైల్వే గేటు వరకు వీధి దీపాల ఏర్పాటును ప్రతిపాదించారు. ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి ఆర్ఎఫ్‌సీఎల్ ప్రతిపాదించిన రూ.3.41 కోట్లలో ఈ వీధి దీపాల ఏర్పాటునకే సుమారు రూ.1.5 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఫెర్టిలైజర్ సిటీ రైల్వే గేటు నుంచి ప్రగతినగర్ వరకు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో రోడ్డు, డివైడర్లు నిర్మించగా అక్కడి నుంచి ఎన్టీపీసీలోని పీటీఎస్ కూడలి వరకు రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రోడ్డు నిర్మాణం చేపట్టారు. ప్రగతినగర్ నుంచి ఎన్టీపీసీ పీటీఎస్ వరకు డివైడర్లు, ఫెర్టిలైజర్ సిటీ రైల్వే గేటు నుంచి పీటీఎస్ వరకు వీధి దీపాలు సైతం లేవు. దీంతో రాత్రివేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఎన్టీపీసీ నుంచి ఫెర్టిలైజర్ సిటీ వరకు వీధి దీపాల ఏర్పాటును ప్రథమ ప్రాధాన్యతగా గుర్తించిన ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులు ప్రతిపాదనలను కేంద్ర కార్యాలయానికి పంపించారు. వరుసగా మూడేళ్లు లాభాలను ఆర్జిస్తేనే సీఎస్సార్ నిధులు కేటాయించాల్సి ఉన్నప్పటికీ సామాజిక బాధ్యతగా గతేడు సైతం సుమారు రూ.50 లక్షలు కేటాయించారు. మొదటగా ఈ ప్రాంతంలోని నాలుగు పాఠశాలల అభివృద్ధికి ఒక్కోదానికి రూ.5 లక్షల నిధులు కేటాయిస్తూ ప్రభుత్వానికి నివేదించారు. మిగతా నిధులతో ప్రభావిత ప్రాంతాల్లోని అభివృద్ధి పనుల కోసం సమాలోచన చేశారు. 'మనఊరు.. మనబడి'లో భాగంగా ఒక్కో పాఠశాలకు సుమారు రూ.20 లక్షలు కేటాయించాలని ప్రభుత్వాధికారులు కోరారు. ఈ విషయంలో జాప్యం నెలకొనడంతో నిధుల వినియోగం జరగలేదు.

## సరిపోని స్థలం.. 48 గదులకే పరిమితం

వేములవాడ: దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు వసతి సౌకర్యం కల్పించేందుకు నూతనంగా వసతి గదులు నిర్మించాలని అధికారులు సంకల్పించారు. ప్రస్తుతం రాజన్న ఆలయానికి సంబంధించి వసతి గదులు అంతంత మాత్రంగానే ఉండటంతో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఆలయ నిధులు రూ.15 కోట్లతో 48 వసతి గదులను నిర్మించేందుకు ప్రణాళికలు తయారు చేశారు. ఇందులో భాగంగా పట్టణంలోని తెలంగాణ కూడలి వద్ద ఉన్న సంస్కృత కళాశాల పాత భవనం ప్రాంతంలోని 20 గుంటల స్థలంలో ఈ వసతి గదులను నిర్మాణం చేయనున్నారు.మొదట భారీ ప్రణాళికఆలయ ఇంజినీరింగ్ అధికారులు మొదట 100 వసతి గదుల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఉన్న విస్తీర్ణం 20 గుంటల్లో నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. అయితే ప్రస్తుతం ఉన్న కళాశాల భవనం ప్రాంతంలో స్థలం సరిపోని కారణంగా 48 గదులకే పరిమితం చేశారు. మంత్రి కేటీఆర్ స్థానిక ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబుతో కలిసి ఇటీవల ఈ అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. మరో నెల రోజుల్లో పనులు ప్రారంభం కానున్నాయి. భవనం కింది సెల్లార్ పార్కింగ్, గ్రౌండ్ ఫ్లోర్‌లో వెయిటింగ్ హాల్, జీ ప్లస్ ఫోర్ పద్ధతిలో ఈ భవనాన్ని నిర్మించనున్నారు. నాలుగు వరసల్లో 12 గదుల చొప్పున నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఆలయ అధికారులు ఇప్పటికే భవన నిర్మాణానికి సంబంధించిన దస్త్రాలను దేవాదాయశాఖ కమిషనర్‌కు పంపించారు. పరిపాలన అనుమతులు మంజూరు కాగానే పనులు మొదలు పెట్టనున్నారు.శిథిల భవనాల కూల్చివేతప్రస్తుతం సంస్కృత కళాశాలకు సంబంధించిన దుకాణాల సముదాయాన్ని అలానే కొనసాగిస్తూ పాత భవనం ఉన్న ప్రాంతంలోని స్థలంలోనే భవనాన్ని అన్ని హంగులతో నిర్మాణానికి రూపకల్పన చేశారు. ఈ వసతి గదుల నిర్మాణం జరిగితే రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉండనుంది. ప్రస్తుతం మూడు ప్రాంతాల్లోని వసతి గదుల భవనాలు శిథిలమయ్యాయి. వీటిని కూల్చి వేసేందుకు ప్రతిపాదనలు పంపగా అందులో శ్రీ రాజరాజేశ్వరపురం భవనాలను కూల్చి వేశారు. శివపురం, శంకరపురం భవనాలు కూల్చి వేయనున్నారు. ఈ భవనాలు శిథిలమై కూల్చి వేస్తుండటంతో భక్తులకు వసతి గదుల కొరత ఏర్పడింది. ఈ మూడు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వసతి గదుల నిర్మాణం చేపడితే రాజన్న దర్శనానికి వచ్చే వేలాది మంది భక్తులకు కొంత వరకు గదుల కొరత తీరనుంది. ఆ దిశగా ఆలయ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని భక్తులు కోరుతున్నారు.స్థలం లేకే..ఆలయానికి చెందిన సంస్కృత కళాశాల ప్రాంతంలో మొదట వంద గదుల నిర్మాణం చేయాలని అనుకున్నప్పటికీ ఉన్న స్థలంలో కొంత రోడ్డుకు వెళ్లడంతో స్థలం సరిపోని పరిస్థితి ఏర్పడింది. దీంతో 48 వసతి గదులను నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం.

# ముంపు ప్రాంతం.. సదుపాయాలు గగనం



జగిత్యాల: మేడిపల్లిలో కనీస సదుపాయాలు లేక స్థానికులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి కుప్పలు తెప్పలుగా పాములు వచ్చాయని ఇక్కడి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వర్షం నీరంతా వెళ్లి పోయాక ప్రతీఇంట్లో పాములు ప్రత్యక్షమవుతున్నాయని చెబుతున్నారు. దీనికి తోడు సాయంత్రం సమయంలో పలు వీధులు అంధకారంలో ఉంటున్నాయి. ఒక్క వీధిలో కూడా వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి సమయంలో అంధకారం నెలకొంటోంది. స్థానిక ప్రజాప్రతినిధులు ఇక్కడ నెలకొన్న సమస్యలపై దృష్టి సారించలేకపోతున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇళ్లు ఉన్న చోట సిమెంట్ రోడ్లు వేయాల్సి ఉండగా... ఇళ్లు లేనిచోట్ల రోడ్లు వేయించారని ఆరోపిస్తున్నారు. చిన్నపాటి గాలికే విద్యుత్తు సరఫరాలో అంతరాయం నెలకొంటోందని.. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా విద్యుత్తు తీగలతో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని చెబుతున్నారు. మంచినీటి ట్యాంకునకు సంబంధించి బోరు మరమ్మతులకు గురై ఐదేళ్లవుతోందని... నేటికీ వినియోగంలోకి తీసుకురావడం లేదని చెబుతున్నారు.

రెండుసార్లు రెడ్ జోన్....

ఇప్పటి వరకు వర్షాకాలంలో మేడిపల్లిని రెండు సార్లు రెడ్ జోన్‌గా ప్రకటించారు. పోలీసులు వచ్చి కాలనీల్లో వరద ముప్పు ఉందని వెంటనే ఇక్కడి నుంచి తరలివెళ్లాలని సూచించారు. ఇటీవల కురిసిన వర్షానికి మూడు రోజుల పాటు ఓ ప్రైవేటు పాఠశాలలో తలదాచుకున్నామని ఇక్కడి ప్రజలు చెబుతున్నారు. వర్షం నీరు తగ్గిన అనంతరం ఇంట్లో ఉన్న నిత్యావసర సరకులు, దుస్తులు, విలువైన కాగితాలు పూర్తిగా తడిసిపోయాయని తెలిపారు. బాధిత కుటుంబాలకు నాయకులు కేవలం ఆరు కిలోల బియ్యం ఇచ్చి చేతులు దులుపుకున్నారని.. అది కూడా పూర్తి స్థాయిలో పంపిణీ చేయలేదని వాపోతున్నారు. ఎన్నికల సమయంలో వచ్చే నాయకులు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీలు ఇస్తున్నారని గెలిచిన అనంతరం ఏ ఒక్క పనీ చేయడంలేదని వాపోతున్నారు. కనీసం వీధి దీపాలు, సీసీరోడ్లు వేయాలని కోరుతున్నామని ఏళ్లు గడుస్తున్నా ఎవరూ తమ గోడును పట్టించుకోవడం లేదని అంటున్నారు. కనీసం బల్దియా నుంచి మంచినీటి పైపులైన్ కూడా లేదని... సింగరేణి సంస్థ ఏర్పాటు చేసిన పైపులైన్ ద్వారా చెరువు నీరు తాగుతున్నామని అంటున్నారు. పలుచోట్ల ఇళ్లపైనుంచే విద్యుత్తు తీగలు ఉండటంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఉంటున్నామని చెబుతున్నారు. చిన్నపాటి గాలికే విద్యుత్తు తీగలు తెగిపోయినా అధికారులు స్పందించడం లేదని... సొంతంగా ప్రైవేటు వ్యక్తులతో మరమ్మతు పనులు చేయించుకుంటున్నామని అంటున్నారు. జంగాలపల్లి, లింగాపూర్, శాలపల్లి, మల్కాపూర్, న్యూపోరట్‌పల్లి, కాశిపల్లిలకు కేంద్రంగా మేడిపల్లిగా ఉండేదని నేడు అభివృద్ధిలో చివరిదశలో ఉందని ఇక్కడి ప్రజలు అంటున్నారు. మౌలిక వసతుల కల్పనకు పాలకులు, అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వీధిదీపాలు ఏర్పాటు చేయండి

మాకు ప్రభుత్వ పథకాలు మంజూరు కావడం లేదు. కనీసం వీధి దీపాలు ఏర్పాటు చేస్తే సరిపోతుంది. మేడిపల్లి ప్రాంతంలో వీధిదీపాలు లేక రాత్రి సమయంలో అంధకారంలో ఉంటున్నాం. చిన్నారులు బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారు. విద్యుత్తు తీగలు ఇళ్లపైనుంచే ఉన్నాయి. ఎటువంటి ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించాలి.

హేమలత, మేడిపల్లి

వరద నీటిలో పంటల మునక

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తిపంట పూర్తిగా మునిగిపోయింది. పొలంలో ఉన్న వరద నీరు పోయిన అనంతరం మొక్కలు ఎర్రగా మారాయి. ఓ వైపు మేడిపల్లి చెరువు... మరోవైపు సమీపాన వాగు కారణంగా తరచూ ఈ ప్రాంతంలోకి వరద వస్తుంది. అధికారులు వరద నివారణకు చర్యలు చేపట్టాలి.

# చెత్త నిర్లక్ష్యం వీడరా?



జగిత్యాల : పురపాలికల్లో చెత్త సేకరణకు ఏటా కోట్లు వెచ్చిస్తున్నా పారిశుద్ధ్యం మెరుగుపడడం లేదు. ప్రధాన రహదారుల వెంట శుభ్రంగా ఉన్నప్పటికీ వీధుల్లో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. శివారు కాలనీల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. చెత్త సేకరణకు వాహనాలు కొనుగోలు చేసినా సరిపోవడం లేదు. పారిశుద్ధ్య సిబ్బంది కొరతతో మరింత ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. తడిపొడి చెత్తను వేర్వేరుగా సేకరించాల్సి ఉన్నప్పటికీ ఎక్కడా అమలు కావడం లేదు. తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేసి ఆదాయం పొందాల్సి ఉన్నప్పటికీ పాలకవర్గాలు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

డంపిగ్‌యార్డు లేక ఇబ్బంది వేలాదిగా భక్తులు వచ్చే ధర్మపురి పుణ్యక్షేత్రంలో పుర వాహనాల ద్వారా చెత్తను సేకరిస్తున్నా డంపింగ్ యార్డు లేక నదీ తీరంలోని శ్మశాన వాటిక పక్కన స్థలంలో వేస్తున్నారు. దీంతో నదీ కలుషితమయ్యే అవకాశం ఉంది. పురపాలక నిబంధనల ప్రకారం తడిపొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డీఆర్‌సీసీ కేంద్రంలో వేసి సేంద్రియ ఎరువు తయారు చేయాలి. డంపింగ్‌యార్డు నిర్మాణం కోసం పలుమార్లు రెవెన్యూ, పుర అధికారులు రెండు చోట్ల స్థలాన్ని సేకరించినా స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో నిలిచిపోయింది. పురపాలికలో 7 స్వచ్ఛ వాహనాలు, రెండు ట్రాక్టర్ల ద్వారా 4.5 టన్నుల పొడి, 3.5 టన్నుల తడి చెత్తను సేకరిస్తున్నారు.

సేంద్రియ ఎరువు తయారీ

పట్టణంలో రోజుకు సుమారు 29 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. తడి పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలని రెండు డబ్బాలను పంపిణీ చేసినా ఫలితం లేకుండా పోయింది. చెత్తసేకరణ ఆటోలకు ప్రజలు తడిపొడి చెత్తను ఒకే డబ్బాలో వేసి ఇస్తున్నారు. పట్టణ శివారులో ఉన్న డంపింగ్ యార్డులో చెత్తను వేయిస్తున్న అధికారులు, కూరగాయల మార్కెట్లో వ్యర్థాలను సేకరించి సేంద్రియ ఎరువును తయారు చేస్తూ మొక్కలకు వేస్తున్నారు.

సేకరణలో అవరోధాలు..పట్టణంలో నిత్యం 60 మెట్రిక్ టన్నుల చెత్తను బల్దియా సేకరిస్తోంది. శివారు పంచాయతీలు, కాలనీలు విలీనం కావడంతో 48 వార్డులకు సరిపడా సిబ్బంది, వాహనాలున్నప్పటికీ సేకరణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పారిశుద్ధ్య నిర్వహణను 4 జోన్లుగా విభజించి సిబ్బందిని కేటాయించినా క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరుపై నిత్యం విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 43 ఆటోలు, 6 ట్రాకర్లు, డంపర్‌పేసర్, 2 టిప్పర్లు, స్వీపింగ్‌యంత్రం చెత్త సేకరణకు వినియోగిస్తున్నారు. 263 మంది సిబ్బందిని చెత్త సేకరణకు కేటాయించారు. కానీ ఇందులో 30 నుంచి 40 మంది సిబ్బంది ప్రముఖుల ఇళ్లలోనో, కార్యాలయ ఇతర విభాగాల్లోనో పనిచేయడంతో సిబ్బంది కొరతకు కారణమైంది. డంపింగ్‌యార్డు సౌకర్యం ఉన్నప్పటికీ సిబ్బంది కొన్నిసార్లు శివారులో చెత్తపారవేయడం వివాదాలకు తావిస్తోంది.

ప్రతిపాదనలకే పరిమితం

పట్టణంలో సుమారు 20 వేల జనాభా ఉండగా 12 వార్డులు ఉన్నాయి. రెండు వార్డులకు ఒక వాహనం కేటాయించి ఇంటింటికీ ఉచితంగా బుట్టలు పంపిణీ చేసినా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం లేదు. పురపాలక సంఘానికి ప్రత్యేకంగా డంపింగ్ యార్డు లేకపోవడంతో శ్మశాన వాటిక స్థలంలో నిల్వ చేస్తున్నారు. పురపాలక సంఘం పరిధిలో 42 మంది కార్మికులు ఉండగా 38 మంది పారిశుద్ధ్య విధులు నిర్వర్తిస్తున్నారు. చెత్త సేకరణ కోసం రెండు వాహనాల కొనుగోలుకు ప్రతిపాదనలు చేసినా ఇంకా కార్యరూపం దాల్చలేదు. పట్టణంలో ఆరు వాహనాలు ఉండగా ఒక వాహనం మరమ్మతుకు గురికాగా ఐదు వాహనాలతో చెత్త సేకరణ చేపడుతున్నారు.

అధ్వానంగా శివారు కాలనీలు

పట్టణంలో మొత్తం 33 వార్డులు ఉండగా 202 మంది పారిశుద్ధ్య కార్మికులున్నారు. ఆయా వార్డులో నిత్యం పారిశుద్ధ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి తడి, పొడి చెత్తను సేకరించేందుకు 32 ఆటోలు, ట్రాక్టర్లు, టిప్పర్లు 15, ఒక స్వీపింగ్ యంత్రం ఉన్నాయి. సేకరించిన చెత్తను వేసేందుకు కల్లూర్‌రోడ్‌లో 5.05 ఎకరాల విస్తీర్ణంలో డంపింగ్‌యార్డును నిర్మించారు. రోజుకు మొత్తం 38.25 టన్నుల చెత్తను సేకరిస్తుంటారు. తడి చెత్తను ఏసుకోనిగుట్ట వద్ద గల సేంద్రియ ఎరువు తయారీ కేంద్రానికి తరలిస్తుండగా, మిగతా చెత్తను కల్లూర్‌రోడ్‌లోని డంపింగ్‌యార్డులో వేస్తారు. పట్టణంలోని శివారు కాలనీలో కాలువలు లేకపోవడంతో మురుగు ఇళ్ల మధ్య నిల్వ చేరుతుంది. పిచ్చిమొక్కలు పెరిగి దుర్గంధం వ్యాపించడంతోపాటు చెత్త చేరి పందులు, దోమలకు నిలయాలుగా మారుతున్నారు.

## హరితహారం లక్ష్యం దూరం

వరంగల్ : జిల్లాలో తెలంగాణకు హరితహారం కార్యక్రమం నత్తనడకన సాగుతోంది. మొక్కలు నాటే లక్ష్యం 25,95,150 ఉందని గత నెల నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 12,43,170 మొక్కలు నాటినట్లు చెప్పారు. ఈ లెక్కన ఇప్పటి వరకు 50 శాతం కూడా పూర్తికాలేదు. సాధారణంగా ఈ నెలలో హరితహారం కార్యక్రమం జోరుగా సాగాలి. ఏఒక్క శాఖ కూడా లక్ష్యం మేరకు మొక్కలు నాటలేదు. ప్రధాన భూమిక పోషించాల్సిన డీఆర్‌డీఏకు 5.85 లక్షల మొక్కలు లక్ష్యం నిర్దేశించగా.. 2 లక్షల వరకు నాటినట్లు అధికారులే చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో ఆ మాత్రం కూడా కనిపించడం లేదు. జిల్లాలో అటవీ శాఖ ఆధ్వర్యంలో 12, గ్రామ పంచాయతీల్లో 323 నర్సరీలు ఉండగా.. వాటిలో 43,96,265 మొక్కలు అందుబాటులో ఉన్నాయి. నర్సరీల్లోనే మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మొక్కల పెంపకంపై నిర్లక్ష్యంగా కారణంగా చాలాచోట్ల ఎదగలేదు.

నర్సంపేటలో నత్తనడక..నర్సంపేట పురపాలిక పరిధిలో హరితహారం కార్యక్రమం నత్తనడకన సాగుతోంది. 24 వార్డుల పరిధిలో 1.50 లక్షల మొక్కలు లక్ష్యంగా నిర్దేశించారు. పుర కార్యాలయ ఆవరణలో గత నెల ఛైర్‌పర్సన్ గుంటి రజని, కౌన్సిలర్లు మొక్కనాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నెల గడిచినా ఇప్పటి వరకు కేవలం 10వేల మొక్కలు మాత్రమే నాటారు. వచ్చే నెల వరకు గడువు ఉండటంతో రోజుకు వెయ్యి చొప్పున నాటిస్తామని కమిషనర్ వెంకటస్వామి, హరితహారం ఇన్‌ఛార్జి నాగరాజు తెలిపారు.

కొరవడిన పర్యవేక్షణ..చెన్నారావుపేట మండలంలో అధికారుల పర్యవేక్షణ కొరవడి నర్సరీలు పూర్తి అధ్వానంగా ఉన్నాయి. ఉపాధి హామీ పథకంలో 54,335 మొక్కలు నాటాలని, ఇళ్లకు 59,964 మొక్కలు పంపిణీ చేయాలని లక్ష్యం ఇచ్చారు. ఇప్పటి వరకుఎవెన్యూ ప్లాంటేషన్ ప్రారంభం కాలేదని, కొన్ని పంచాయతీల్లో ఇంటింటికి మొక్కలు పంపిణీ చేసినట్లు ఎంపీవో శ్రీధర్‌రాజ్ తెలిపారు. శంకరం తండా నర్సరీ నిర్వహణ పూర్తి అధ్వానంగా ఉంది. గడ్డిపెరిగి మొక్కలు అందులో కనిపించడం లేదు. మరికొన్నిమొక్కలు ఎండిపోయాయి. ఇక్కడ నర్సరీని శ్మశానవాటికలో ఏర్పాటు చేశారు.

మొక్కల పంపిణీ అంతంతే..నెక్కొండ మండలంలోని 39 గ్రామ పంచాయతీల్లో 40 నర్సరీలు ఏర్పాటు చేశారు. ఒక్కోదాంట్లో 6 వేల చొప్పున 2.40 లక్షల మొక్కలు పెంచాలని లక్ష్యంగా పెట్టారు. 72 వేల మొక్కలు అవెన్యూ ప్లాంటేషన్ చేయాలని నిర్ణయించారు. అయితే ఈసారి వేసవిలో ఎండలు ఎక్కువగా ఉండటంతో మొక్కల ఎదుగుదల అంతంత మాత్రంగానే ఉంది. నిర్వాహకులు తగిన సంరక్షణ చర్యలు చేపట్టకపోవడంతో మొక్కలు చాలా వరకు ఎండిపోయాయి. గత నెలలో పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉండటంతో మొక్కలు నాటే పనులు ముందుకు సాగలేదు. దీంతోపాటు ఇంటింటికి ఆరు మొక్కల పంపిణీ కూడా సరిగా జరగలేదు. ఎవెన్యూ ప్లాంటేషన్ పనులు త్వరలోనే పూర్తి చేస్తామని ఏపీవో జాకబ్ తెలిపారు.

గ్రేటర్ వరంగల్‌లో 26 శాతమే..వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోని 66 డివిజన్లలో ఈ ఏడాది 10.77 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం ఉండగా కేవలం 2.81 లక్షలు మాత్రమే నాటారు. అంటే ఇది లక్ష్యంలో 26 శాతమే. మొదట్లో వర్షాలు లేక ఇబ్బందులు ఎదరైతే.. తరవాత భారీ వర్షాలు నగరాన్ని ముంచెత్తడం కూడా హరితహారం కార్యక్రమానికి ఆటంకంగా మారింది. వరదల నుంచి కోలుకోవడంతో ఆగస్టు 15 నుంచి పెద్ద ఎత్తున మొక్కలు నాటడానికి గ్రేటర్ ఉద్యాన విభాగం అధికారులు సన్నద్ధం అవుతున్నారు. ఇంటింటికి అయిదు మొక్కల చొప్పున 8.10 లక్షల మొక్కలు పంపిణీ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. కాజీపేట, హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లోని 26 నర్సరీల్లో హరితహారం కోసం 10.56 లక్షల మొక్కలు సిద్ధంగా ఉంచారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ నగర పర్యటన సందర్భంగా 2.81 లక్షల మొక్కలు నాటినట్లు బల్దియా ముఖ్య ఉద్యాన వన అధికారి సీహెచ్.శ్రీనివాస్ తెలిపారు. పది ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తూ మొక్కలను సంరక్షిస్తున్నామని చెప్పారు.

నర్సరీల్లోనే ఏపుగా పెరిగాయి..గీసుకొండ మండలంలోని రాంపురం నర్సరీలో 6 వేల మొక్కలు పెంచారు. జామ, గులాబి, చామంతి, మందార, గోరింట, పారిజాతం, కానుగ, భోహినియా, దుర్యణ్, టెకోమా, చింత మొక్కలు ఏపుగా పెరిగాయి. 125 ఇళ్లు ఉండగా ఇప్పటివరకు 400 మొక్కలు పంపిణీ చేశారు. హరితహారంలో చాలా తక్కువ మొక్కలు నాటడంతో ఇటీవల నర్సరీని పరిశీలించిన సందర్భంగా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో ఎక్కువ మొత్తం చౌడు నేలలు ఉండడంవల్ల నాటిన మొక్కలు బతకడం లేదు. నెల రోజులుగా పంచాయతీ సిబ్బంది సమ్మెలో పాల్గొనడం, భారీ వర్షాల తరవాత మళ్లీ వానలు కురవకపోవడం వంటి కారణాల వల్ల మొక్కలు నాటడంలో ఆలస్యం జరిగిందని పంచాయతీ కార్యదర్శి రంజిత్ తెలిపారు.

## దిగొస్తున్న కూరగాయల ధరలు

వరంగల్ : కూరగాయల ధరలు దిగొస్తున్నాయి. నెల రోజుల పాటు ధరలు ఆకాశన్నంటడంతో వినియోగదారులు విలవిలలాడారు. ఒక దశలో కోడిమాంసం కంటే టమాట, మిర్చి, బోడకాకర తదితరాల ధరలు పెరిగిపోయాయి. టమాటా ధర ఏకంగా కిలోకి రూ.200కు కూడా విక్రయించారు. గత 50 రోజులుగా అన్ని రకాల కూరగాయలు ధరలు కిలో రూ.100కు పైగానే పలకడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడు రోజులనుంచి కూరగాయల ధరలు తగ్గుతూ వస్తున్నాయి. వరంగల్ మార్కెట్‌కు ఎక్కువగా స్థానిక రైతుల పొలాలనుంచి వస్తుంటాయి. ఈసారి ఉమ్మడి జిల్లాలో కూరగాయల సాగు పూర్తిగా తగ్గడంతో హైదరాబాద్, రంగారెడ్డి,



అనంతపురం, కర్నూలు, కర్ణాటక నుంచి కూరగాయలు దిగుమతి అవుతున్నాయి. అక్కడ ఎక్కువ పాలీ హౌస్‌లుండటంతో టమాటా, ఇతర కూరగాయలు నిత్యం కోతకు వస్తున్నాయి. రైతులు సాగుచేసిన కూరగాయల పంటల దిగుబడులు కూడా చేతికి వస్తుండటంతో ధరలు క్రమేణా తగ్గుతూ వస్తున్నాయని ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటికే రైతులు కూరగాయల పంటలు సాగు చేశారు. ఇతర ప్రాంతాలనుంచే దిగుమతి ఎక్కువగా జరుగుతోంది. మరో పదిహేను ఇరవై రోజుల్లో దిగుమతి భారీగా పెరిగి ధరలు సాధారణ స్థితికి చేరుకునే వీలుంది.

# సౌందర్యలహరి

ఖమ్మం : తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిద్దాం.. ఆచరిద్దాం.. అనే శుభ సంకల్పంతో శ్రీఆదిశంకరాచార్య విరచిత 'సౌందర్యలహరి' శ్లోక పఠనానికి శ్రీకారం చుట్టారు ఖమ్మం మహిళలు. స్థానిక గాంధీచౌక్ ప్రాంతంలోని 'అష్టలక్ష్మీ వైభవ దీపిక' బృందంలోని 48 మంది మహిళలు ఈ శ్లోకాలను నేర్పిస్తున్నారు. ఇటీవల ఆగస్టు 1న అధిక శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని గాంధీచౌక్ విజయ గణపతి దేవస్థానంలో 135 మంది ముత్తైదువలు ఏకరూప వస్త్రధారణతో వంద శ్లోకాలను భక్తితో సామూహికంగా పఠించారు.

**మూడు నెలల శిక్షణ..**

అష్టలక్ష్మీ దీపిక బృందంలోని సభ్యురాలు బిజ్జాల దుర్గ మొదట ఆన్‌లైన్‌లో కొండూరి పద్మావతి సారథ్యంలో సౌందర్యలహరి శ్లోక సాధన చేశారు. అనంతరం బృందంలోని 47 మందికి నేర్పారు. ఈ బృందంలోని ఒక్కొక్కరు ఐదుగురు మహిళలకు చొప్పున శ్లోక పఠనంలో శిక్షణ ఇచ్చారు. ఉచ్ఛారణలో జాగ్రత్తలు తీసుకున్నారు. శ్లోకాలను చదవడం అంటే అంత సులువైన విషయం కాదు. దోషాలు లేకుండా ఉచ్ఛరించే వారినే ఎంపిక చేశారు. సమయపాలనను సమగ్రంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక స్తోత్రాలు నేర్చుకోవాలన్న తపనతో గృహిణులంతా గంట



కొట్టినట్లు పుస్తకంతో శిక్షణకు హాజరయ్యారు. నియమ నిష్ఠలతో మూడు నెలల శిక్షణ పూర్తి చేశారు.

**శ్లోక పఠనంలో నిబంధనలు**

వంద శ్లోకాలను చదివేటప్పుడు అష్టలక్ష్మీ వైభవ దీపిక బృందం మహిళలకు కొన్ని నిబంధనలు అమలు చేశారు. శిక్షణకు వచ్చేటప్పుడు కచ్చితంగా చీరను ధరించాలి. కాళ్లకు పసుపు, అరి చేతులకు గోరింటాకు, నిండుగా గాజులు, మెడలో నల్లపూసలు, గంధం, కళ్లకు కాటుక, నుదుట బొట్టు, తలలో పువ్వులు తప్పనిసరిగా అలంకరించుకోవాలి. ఇంటిదగ్గర చిన్నపిల్లలు, వృద్ధులైన అత్తామామలకు ఇబ్బంది కలిగించకుండా శిక్షణకు రావాలి. సెల్‌ఫోన్‌లతో చిత్రాలు తీసుకోవటం నిషేధం. అసలు శిక్షణ తీసుకునేటప్పుడు సెల్‌ఫోన్‌లు దగ్గర ఉండకూడదు.


**తొమ్మిదేళ్లుగా కార్యక్రమాలు..** తొమ్మిదేళ్ల నుంచి అష్టలక్ష్మీ వైభవ దీపిక బృందం పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. గోశాలకు పశుగ్రాస వితరణ, వేసవిలో మజ్జిగ పంపిణీ, వృద్ధులకు అన్నదానం చేస్తున్నారు. ప్రతీనెల అమావాస్య, పౌర్ణమి రోజుల్లో విష్ణు సహస్ర నామం, కనకధారస్తోత్రం, శ్రీసూక్తం, శత రుద్రీయం, తిరుప్పావై, సుందరకాండ సామూహిక పఠనం చేస్తున్నారు. గతంలో 1008 మంది మహిళలతో పెవిలియన్ గ్రౌండ్‌లో విష్ణు సహస్ర నామం పారాయణ నిర్వహించారు. ప్రతీ సంవత్సరం శ్రావణ మాసంలో మంగళ, శుక్రవారాలు హనుమాన్ చాలీసా, లలితా సహస్ర నామం, ఖడ్గమాలను భక్తితో సామూహిక స్తోత్ర పారాయణం చేస్తున్నారు.

# కుష్ఠ వ్యాధి నియంత్రణకు పకడ్బందీ సర్వే

కొత్తగూడెం : జిల్లాలో కుష్ఠ నియంత్రణ చర్యలను గత మూడు సంవత్సరాల నుంచి వైద్యారోగ్య శాఖ అధికారులు కొనసాగిస్తున్నారు. ఏటా రెండుసార్లు వ్యాధిగ్రస్తులను గుర్తిస్తున్నారు. ఇందుకోసం స్థానిక ఆశా కార్యకర్తలు, మగ వైద్య సిబ్బందితో బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. వారితో జిల్లావ్యాప్తంగా ఈ నెల 16వ తేదీ నుంచి 31 వరకు ఇంటింటి సర్వే చేపట్టనున్నారు. నోడల్ అధికారులకూ శిక్షణ పూర్తయింది. బృందాలు కీలక సర్వేకు సన్నద్ధమవుతున్నాయి.

**మూడంచెల విధానం..**

వ్యాధిగ్రస్తుల సంఖ్య తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రాథమికంగా లక్షణాలు గుర్తించడం, వ్యాధి తీవ్రత ఉన్నవారికి సరైన వైద్యం చేరువచేయడమే ప్రత్యేక కార్యక్రమం లక్ష్యం. శరీరంపై స్పర్శ లేని మచ్చలను గుర్తించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేపడుతున్నారు. మూడంచెల విధానంలో పరీక్షలు జరుగుతాయి. అనుమానితులకు స్థానిక పీహెచ్‌సీల వైద్యాధికారులు, లెప్రసీ విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో పరీక్షలు నిర్వహిస్తారు. పాజిటివ్ వస్తే బహుళ ఔషధ చికిత్స (ఎండీటీ) కొనసాగిస్తూ మందులు సమయానికి పంపిణీ చేస్తారు. అవసరమైన వారికి చెప్పులు, సామగ్రి పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 351 మంది కుష్ఠు వ్యాధిగ్రస్తులు నమోదై ఉన్నారు. బాధితుల సంఖ్యపెరగకుండా ఎప్పటికప్పుడు సర్వేలు చేపడుతూ నియంత్రణ చర్యలు తీసుకుంటున్నారు. మూడేళ్లుగా వరుస కార్యక్రమాలు



చేపడుతుండటంతో వ్యాధికి గురయ్యే వారి సంఖ్య తగ్గుతూ వస్తోంది. 2020, 2021లో కొవిడ్ విజృంభణతో సర్వే కుంటుపడగా ఆ తర్వాత నుంచి ఏటా రెండు దఫాలుగా నిర్వహిస్తున్నారు.

**సిబ్బందికి సహకరించండి** డా. జేవీఎల్ శిరీష, డీఎంహెచ్‌ఓ

చాలా మంది కుష్ఠు వ్యాధి బాధితులు లక్షణాలు గుర్తించలేని పరిస్థితుల్లో ఉంటున్నారు. అందుకే ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టేలా చూస్తున్నాం. మా బృందాలకు ప్రజలు సహకరించాలి. సిబ్బందిని ఇంట్లోకి వచ్చేందుకు అనుమతించాలి. లక్షణాల నిర్ధారణ కోసం అవసరమైతే శరీర భాగంలో రహస్య ప్రదేశాలను సైతం పరిశీలించేందుకు అంగీకరించాలి. ఎవరికీ ఇబ్బందులు లేకుండా ఆడ, మగ వైద్య సిబ్బంది బృందాల్లో ఉంటారు. అనుమానిత లక్షణాలుంటే స్థానిక వైద్యాధికారి, లేదా చర్మవ్యాధుల నిపుణులూ పరీక్షలు చేస్తారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో జరిగే కార్యక్రమాలకు పూర్తి సహకారాన్ని కోరుతున్నాం.

# మైనార్టీ రుణాలకు కొత్త దరఖాస్తుల్లేవ్



ఖమ్మం : బీసీ రుణాల మాదిరిగానే మైనార్టీలకు తెలంగాణ ప్రభుత్వం రూ.లక్ష రాయితీ పథకాన్ని ప్రకటించింది. అనేక మంది మైనార్టీలు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని భావించారు. గతంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు తప్ప కొత్తగా స్వీకరించకపోవడంతో తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. రూ.లక్ష చొప్పున సాయానికి సంబంధించి బీసీలు, క్రిస్టియన్ మైనార్టీల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కానీ ముస్లిం, ఇతర మైనార్టీల నుంచి ఇంతవరకు కొత్త దరఖాస్తుల స్వీకరణకు తేదీ ప్రకటించలేదు. గతంలో చేసుకున్న పాత దరఖాస్తుదారులకు మాత్రమే ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు అధికారులు చెబుతుండటంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో కొత్తవారి ఆశలు అడియాసలయ్యాయి.

**ఖమ్మం జిల్లాలో...** మైనార్టీ రుణాలకు గత డిసెంబరులో ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. జనవరిలో లబ్ధిదారుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించింది. రూ.2 లక్షల వరకు మంజూరు చేసే ఈ రుణాలకు రూ.లక్ష వరకు 80 శాతం, రూ.2 లక్షల వరకు 70 శాతం సబ్సిడీని ప్రకటించింది. ఖమ్మం జిల్లాలో 8,220 మంది దరఖాస్తు చేసుకోగా కేవలం 202 మందిని మాత్రమే ఎంపిక చేసింది. వీరికి రూ.1.97 కోట్లను కేటాయించింది. ఇంత వరకు వీటికి సంబంధించిన యూనిట్లను గ్రౌండ్ చేయలేదు. తాజాగా ప్రకటించిన రూ.లక్ష సాయం పథకం గతంలో దరఖాస్తు చేసుకున్న వారికే వర్తింపజేయనున్నట్లు ప్రకటించింది. గతంలో దరఖాస్తు చేసుకున్న వారి నుంచే నియోజకవర్గానికో 120 మందిని ఎంపిక చేస్తారు.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో...**

గతంలో 3,377 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో కేవలం 140 మందిని మాత్రమే ఎంపిక చేశారు. 23 మండలాలు ఉంటే ఆళ్లపల్లి, పినపాక, కరకగూడెం, గుండాల, టేకులపల్లి, దుమ్ముగూడెం మండలాలకు ఒక్క యూనిట్ కూడా మంజూరు చేయలేదు. కొత్త జిల్లాల ఏర్పాటు అనంతరం మైనార్టీ యువతీ, యువకులకు స్వయం ఉపాధి కోసం ఇచ్చిన తొలి నోటిఫికేషన్‌కు సంబంధించి ఇంతవరకు భద్రాద్రి కొత్తగూడెంలో ఒక్క యూనిట్ అయినా గ్రౌండ్ కాలేదు.

**జనాభా ప్రకారం వర్తింపజేయాలని విన్నపం**

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 2011 జనాభా ప్రకారమే మైనార్టీలకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తున్నారని, అప్పటి నుంచి చూస్తే ఇప్పటి వరకు జనాభా ఎంతో పెరిగిందని మైనార్టీ సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు. తాజా జనాభా ప్రకారం పథకాలను వర్తింపజేస్తే అనేక మందికి ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని న్యాయం చేయాలని కోరుతున్నారు.

# మందగించిన స్థిరాస్తి వ్యాపారం



ఖమ్మం :కొవిడ్ అనంతరం మధ్యతరగతి కుటుంబాల ఆదాయం క్షీణించటం, నిత్యావసరాల ధరల పెరుగుదల, బ్యాంకులు రుణాలపై వడ్డీరేటు పెంచటం తదితర అంశాలు స్థిరాస్తి రంగంపై ప్రభావం చూపుతున్నాయి.

కొత్తగూడెం, పాల్వంచలో అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లు గతంలో కొన్నవారు ఈ ఏడాది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అందుకే ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లు పెరిగాయి. ఖమ్మంలో రేసుగుర్రంలా పరుగులు తీసిన స్థిరాస్తి వ్యాపారం కొన్నాళ్లుగా మందగించింది. బహుళ అంతస్తులను అధికంగా నిర్మిస్తున్నా వాటిలోని ఫ్లాట్లు చాలావరకు ఖాళీగా ఉంటున్నాయని బిల్డర్లు చెబుతున్నారు. మరోవైపు ఓపెన్ ప్లాట్లు (ఇళ్ల స్థలాలు) ధరలు పెరిగాయి. ఖమ్మం పరిసర ప్రాంతాల్లో చదరపు గజం స్థలం ధర రూ.15వేలకుపైగా పలుకుతోంది. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో చదరపు గజం ధర కనిష్ఠంగా రూ.20వేలు, గరిష్ఠంగా రూ.2 లక్షలకు పైగా నమోదవుతోంది.

**భవన నిర్మాణ వ్యయం రెట్టింపు**

కొవిడ్ అనంతర కాలంలో భవన నిర్మాణ వ్యయం రెట్టింపయ్యింది. కూలీ రేట్లతో పాటు ఇనుము, సిమెంట్, పెయింట్స్, విద్యుత్తు ఉపకరణాలు సహా మిగతా వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. తద్వారా బహుళ అంతస్తుల భవనాల్లో ఫ్లాట్ల ధరలు పెంచేశారు. హైదరాబాద్‌లో ధరలకు పోటీగా ఖమ్మంలో బహుళ అంతస్తుల భవనాల్లో చదరపు అడుగుకు రూ.6వేలు చెబుతున్నారు. డబుల్ బెడ్ రూం ఫ్లాట్ కొనాలంటే కనీసం రూ.75 లక్షలు కావాలి. కొన్ని ప్రాంతాల్లో చదరపు అడుగు ధర రూ.4,500 పలుకుతోంది. చాలామంది సెకండ్ సేల్స్ అపార్ట్‌మెంట్ల వైపు మొగ్గు చూపుతున్నారు.

**ఓపెన్ ప్లాట్ల ధరల్లో పెరుగుదల**

మరోవైపు ఓపెన్ ప్లాట్ల ధరలు పెరిగాయి. ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు తీసుకునేందుకు డెవలపర్స్‌కు ఖర్చు పెరుగుతోంది. ఖమ్మం నగరానికి 15 కి.మీ. పరిధిలో చదరపు గజం ధర కనీసం రూ.15 వేల నుంచి రూ.30 వేలు పలుకుతోంది. కొందరు బిల్డర్లు వెంచర్లలో ఇండిపెండెంట్ ఇళ్లు నిర్మించి విక్రయిస్తున్నారు. ప్రాంతాన్ని బట్టి ఒక్కో ఇల్లు రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు ధర పలుకుతోంది. ఇటీవల ఇలాంటి ఇళ్ల అమ్మకాలూ మందగించాయి.

**గృహ రుణాలూ అంతంతే..**

గతంలో బ్యాంకులు ఉద్యోగులకు విరివిగా గృహ రుణాలిచ్చేవి. కొన్నినెలలుగా ఇంటి రుణాల మంజూరుకు కొన్ని బ్యాంకులు ఆసక్తి చూపటం లేదు. నెలవారీ వాయిదాల(ఈఎంఐ) చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నందున బ్యాంకర్లు అసంతృప్తితో ఉన్నారు. ఖమ్మం నగరం, సత్తుపల్లి, మధిర, వైరా పురపాలికలు, భద్రాద్రి జిల్లాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. స్థిరాస్తి రంగం మందగించటంతో రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం క్షీణిస్తోంది.

కొన్ని నెలలుగా స్థిరాస్తి మార్కెట్ మందగించింది. ఎన్నికలు ముగిసిన తర్వాత క్రయవిక్రయాలు పుంజుకుంటాయని భావిస్తున్నాం. నిర్మాణ సామగ్రి వ్యయం, కూలీ రేట్ల పెరుగుదలతో ఫ్లాట్ల ధరలు పెంచాల్సి వస్తోంది. నిబంధనల మేరకు వెంచర్లు వేస్తున్నందున గిట్టుబాటయ్యేలా ఓపెన్ ప్లాట్లను అమ్ముకునేందుకు వ్యాపారులు యత్నిస్తున్నారు. బండి జయకిశోర్, క్రెడాయ్, జిల్లా అధ్యక్షుడు, ఖమ్మం

# బడి .. వరద అలజడి



పాల్వంచ : ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం 'మన ఊరు/మనబస్తీ–మన బడి' పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోంది. ఎంపిక చేసిన పనులకు రూ.కోట్లు వెచ్చిస్తోంది. కావాల్సిన సదుపాయాలు కల్పిస్తోంది. వర్షాకాలంలో పాఠశాలల ఆవరణలో వరద నీటి సమస్యపై దృష్టి సారించలేదు. ఇటీవల భారీ వర్షాలకు కొన్ని బడులు తటాకాలను తలపించాయి. మోకాలి లోతు నిలిచిన నీళ్లను దాటి తరగతి గదులకు వెళ్లేందుకు చిన్నారులు ఆందోళన చెందారు. అపరిశుభ్రత నెలకొనడంతో పాటు విష పురుగులు, సర్పాలు గదుల్లోకి చేరుతున్నాయి. విద్యార్థులు భయంభయంగా బడులకు రావాల్సిన పరిస్థితి. గిరిజన, బీసీ, ఇతర వసతిగృహాల్లోనూ ముంపు బెడద నెలకొంది. దీనిపై విద్యాశాఖ అధికారులు దృష్టిసారించాలి.

**ఆవరణల చదునుతో పరిష్కారం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం, భద్రాచలం, బూర్గంపాడు, చర్ల, దుమ్ముగూడెం, మణుగూరు, పినపాక, జూలూరుపాడు, పాల్వంచ, ఖమ్మం జిల్లాలోని పెనుబల్లి, కారేపల్లి తదితర మండలాల్లోని పలు పాఠశాలల ఆవరణలు ముంపునకు గురవుతున్నాయి. లోపల నీరు చేరకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. సమస్య నెలకొన్న విద్యాలయాలను వెంటనే గుర్తించాలి. స్థానిక పాలకవర్గాలు, మున్సిపల్ అధికారుల సహకారంతో లోతట్టు ప్రాంతాల్ని చదును చేయించాలి. అవసరమైన చోట శాశ్వత డ్రెయిన్లు, తాత్కాలిక కాల్వలు వంటివి తవ్వించాలి. చర్యలు తీసుకుంటున్నాం: సోమశేఖరశర్మ, డీఈఓ ఆవరణలో, గదుల చుట్టూ వర్షపు నీరు నిలిచే విద్యాలయాల సమాచారం సేకరిస్తున్నాం. వరద నీటిని లోతట్టుకు తరలించే పనుల గురించి స్థానిక పంచాయతీ, మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్నాం. సిబ్బందిని పంపించి కాల్వలు తవ్వించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైన చోట్ల మొరంతో చదును చేయిస్తాం. భద్రాద్రి జిల్లాలో ఏడు ముంపు ప్రాంత మండలాల్లో సమస్య ఎక్కువగా ఉంది. బియ్యం, ఇతర సామగ్రి, విలువైన ధ్రువపత్రాలను భద్రపరచాలని ఎంఈఓలకు సూచించాం.

# మిగులు మూడో వంతు

జగిత్యాల విద్యానగర్: జిల్లాలో మైనారిటీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో భర్తీకి నోచుకోక ఏటా వందల సంఖ్యలో సీట్లు మిగులుతున్నాయి. ఇదే స్థాయిలో మైనారిటీయేతర నిరుపేద విద్యార్థులు ప్రవేశాలు లభించక నిట్టూరుస్తున్నారు. పెద్ద సంఖ్యలో సీట్లు మిగిలిపోతుండగా రిజర్వేషన్ ప్రకారం ఇతరులకు కేటాయించే అవకాశం లేకపోవడంతో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేద విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. జగిత్యాలలో బాలుర, బాలికల, కోరుట్ల, మెట్పల్లిలో బాలుర, ధర్మపురి బాలికల గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలు అందుబాటులో ఉన్నాయి. అన్ని గురుకుల పాఠశాలల్లో కలిపి 2021–22 విద్యా సంవత్సరంలో మొత్తం 2400 సీట్లు ఉండగా వీటిలో 549 సీట్లు, 2022–23 విద్యా సంవత్సరంలో 2360కు గాను 546 సీట్లు, ప్రస్తుత విద్యా సంవత్సరంలో 2280కు గాను 585 సీట్లు భర్తీ కాలేదు. జూనియర్ కళాశాలల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఐదు జూనియర్ కళాశాలల్లో 2021–22 విద్యా సంవత్సరంలో 560 సీట్లు మంజూరవగా 208 సీట్లు, 2022–23 విద్యా సంవత్సరంలో 800కు గాను 326 సీట్లు భర్తీ కాలేదు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రవేశాల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. మొత్తం 800 సీట్లకు గాను 367 భర్తీకి నోచుకోలేదు.

**ఇతరులకు అవకాశం లేదు**



మైనారిటీ కోటాలో భర్తీ కాని సీట్లు మిగిలినప్పటికీ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇతరులకు ప్రవేశాలు కల్పించడానికి అవకాశం లేదు. ఆశించిన స్థాయిలో జనాభా, విద్యపై పూర్తిస్థాయిలో మక్కువ, వసతిగృహంలో ఉండటానికి ఆసక్తి లేకపోవడం మైనారిటీ సీట్లు పూర్తిస్థాయిలో భర్తీ కావడం లేదు. ఇందుకోసం ప్రతి విద్యా సంవత్సరం మైనారిటీ వర్గాలున్న ప్రాంతాల్లో తల్లిదండ్రులు, విద్యార్థులకు చైతన్యం కల్పించి అవగాహన పెంపొందిస్తున్నాం.

ఎస్.డి.హమీద్, ప్రాంతీయస్థాయి సమన్వయకులు.

**సరిపోని తరగతి గదులు** జగిత్యాల బాలుర, ధర్మపురి బాలికల గురుకుల పాఠశాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తుండగా స్థలాభావం కారణంగా సెక్షన్లు తగ్గించారు. ఐదు, ఆరు తరగతుల్లో రెండు సెక్షన్లకు గాను ఒకటే నిర్వహిస్తున్నారు. దీంతో రెండేళ్లుగా మంజూరయ్యే సీట్ల సంఖ్య కూడా తగ్గించాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ నియోజ కవర్గమైన ధర్మపురిలోని బాలికల గురుకుల పాఠశాలలో 2021లో సీట్ల సామర్థ్యం 480 ఉండగా ప్రస్తుతం అది 400కి చేరుకుంది. తరగతుల నిర్వహణకు సరిపడినన్ని గదులు లేకపోవడంతో ప్రవేశాలను 300కే పరిమితం చేయడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. జగిత్యా లలోని బాలుర పాఠశాలలో సైతం గతేడాది 480 నుంచి 440కి తగ్గింది.

# స్థాయి పెంపు.. వైద్యం మెరుగు

కరీంనగర్ : ప్రభుత్వ వైద్యం మరింత చేరువవుతోంది. సమకూరుతున్న కొత్త వసతులు రోగికి మరింత భరోసానిస్తున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని రెండు నియోజకవర్గ కేంద్రాల్లోని ఆసుపత్రుల్లో పడకల స్థాయిని పెంచడంతో పేదలకు మరింత మెరుగైన చికిత్స అందనుంది. ఇప్పటికే ప్రభుత్వాసుపత్రుల్లో ఒక్కోటిగా సమకూరుతున్న సౌలభ్యాలతో ఇక్కడకు వచ్చే ఇన్‌పేషెంట్ల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ప్రైవేటుకు దీటుగా పల్లె నుంచి పట్నం వరకు సర్కారు దవాఖానాలో అందే వైద్య సేవలు ఉపయుక్తంగానే మారాయి. కరీంనగర్ జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో ఆరోగ్యానికి మేలు చేసే విధంగా వైద్యం అందుబాటులోకి వస్తుండటం శుభపరిణామం.

**ప్రయోజనమిలా..** చొప్పదండి, మానకొండూర్‌లో రూ.55 కోట్ల నిధులు మంజూరు చేయడంతో ఆధునిక భవన నిర్మాణంతోపాటు వసతులు సమకూరనున్నాయి. ఈ నియోజకవర్గ పరిధిలోని మారుమూల గ్రామాల ప్రజలకు ఇక్కడి దవాఖానాతో ప్రయోజనం కలగనుంది. జిల్లా కేంద్రాసుపత్రికి వెళ్లకుండా దూరభారం తగ్గడంతోపాటు ప్రయాణపరంగా ఆర్థికంగా వెసులుబాటు లభిస్తోంది.

ప్రసూతి సేవలు మెరుగు కావడంతోపాటు కొత్తగా వైద్య సిబ్బంది నియమితులవుతారు. అన్ని రకాల శస్త్రచికిత్సలు కూడా ఇక్కడ చేస్తారు. వైద్య విధాన పరిషత్ పర్యవేక్షణ పెరగడంతోపాటు ఎప్పటికప్పుడు ఇక్కడ పేదలకు అందే వైద్యంపై వైద్యారోగ్యశాఖ ప్రత్యేక శ్రద్ధ పెట్టనుంది. రాత్రి వేళల్లోనూ వైద్యులు అందుబాటులో ఉండటంతో అత్యవసర చికిత్స అందనుంది.

ఆపరేషన్ గదితోపాటు ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తారు. 24 గంటలపాటు వైద్యసేవల్లో సిబ్బంది ఉంటారు. చొప్పదండిలో పోస్టుమార్టం సేవలు అందుబాటులోకి వస్తాయి. చిన్నపిల్లల వైద్య నిపుణులతోపాటు దంత వైద్యులు, ఇతరత్రా పరీక్షలకు ఇక్కడ అవకాశం ఉంటుంది. ఇప్పుడున్న సిబ్బంది సంఖ్య పెరగడంతోపాటు పొరుగు సేవల కొలువులు లభిస్తాయి. వంద పడకల దవాఖానాలో 10 మంది సివిల్ సర్జన్‌లు, ఏడుగురు డిప్యూటీ సివిల్ సర్జన్‌లు, 25 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్‌ల రూపంలో వైద్యుల సహాయం మరింత పెరుగుతుంది. ఇదే సమయంలో హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంల సంఖ్య ఎక్కువవుతుంది. మిడ్‌వైఫరీ నర్సులు, ఫార్మసిస్టులు, థియేటర్ అసిస్టెంట్లతోపాటు ఇతర సిబ్బంది పని చేస్తారు.

**వెయ్యికిపైగా అవసరం..** జిల్లాసుపత్రితోపాటు ప్రాంతీయ ఆసుపత్రులలో ప్రస్తుతమున్న పడకల సంఖ్య వెయ్యికిపైగా పెరిగితే పేదలకు మేలు జరగనుంది. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో వైద్య కళాశాల ఏర్పాటు కావడంతో అక్కడ రోజూవారీగా వస్తున్న ఔట్‌పేషెంట్లు, ఇన్‌పేషెంట్ల సంఖ్య రోజుకింత పెరుగుతోంది. ఎంసీహెచ్, జిల్లాసుపత్రిలో కలిపి ప్రస్తుతమున్న 500 పడకల ద్వారా మంచి సేవలందుతున్నాయి. ఎంసీహెచ్‌లో మరో వంద పడకలు మంజూరైనా సిబ్బంది కొరతతో ఆ సేవలు ప్రారంభంకాలేదు. జిల్లాసుపత్రికి రోజు 2 వేలకుపైగా ఔట్‌పేషెంట్లు వస్తుండగా ఇన్‌పేషెంట్లు నిర్ణీత పడకల సంఖ్యనుబట్టి ఉంటున్నారు. కరీంనగర్‌లో మరో 200, జమ్మికుంటలో మరో 20 పడకల స్థాయి పెరిగితే రోగులకు మేలు జరిగే వీలుంది. ఇదేకాకుండా మానకొండూర్ ఆసుపత్రికి మరో 50 పడకలు అదనంగా అందితే చుట్టుపక్కల ఉన్న గ్రామీణ జనాలకు మరింత దగ్గరయ్యే వీలుంటుంది.

# దాస్‌నగర్ ఠాణా పూర్తయ్యేనా?

కామారెడ్డి : మాక్లూర్ మండలం దాస్‌నగర్ వద్ద 63వ నంబరు జాతీయ రహదారి పక్కన ఠాణా నిర్మించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా చేట్టిన పనులు ఇప్పటికీ పూర్తికాలేదు. మూడేళ్లుగా పూర్తిచేయాలని కోరుతున్నా స్పందన లేదు.

ఇదీ కథ : దాస్‌నగర్ సమీపంలో 2017 చివరలో రూ.కోటి నిధులతో పనులు ప్రారంభించారు. ఏడాదిలోనే వినియోగంలోకి తెస్తామని చెప్పారు. ప్రస్తుతం మాక్లూర్ మండల కేంద్రంలో పాత భవనంలోనే కొనసాగిస్తున్నారు. నిజామాబాద్- ఆర్మూర్ మార్గంలో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దాస్‌నగర్ వద్ద ఠాణా ఏర్పాటు చేస్తే పోలీసులు క్షతగాత్రులకు తక్షణ సాయం అందించేందుకు వీలుంటుందని ఉన్నతాధికారులు ఆలోచన. నిధులు లేక ఇబ్బందులు: దాదాపు ఆరేళ్లు కావొస్తున్నా నేటికీ పనుల్లో జాప్యం నెలకొంది. 2017లో మొదట ఓ గుత్తేదారు పనులు చేసేందుకు ముందుకొచ్చారు. 2800 చ.అ. విస్తీర్ణంలో నిర్మించాలని



ప్రణాళిక రూపొందించారు. ఇందుకు రూ.కోటి కేటాయించారు. స్లాబ్ వరకు నిర్మించి ఆపేశారు. నిధులు రాకపోవడంతో ఒప్పందం రద్దు చేసుకున్నారు. మిగతా నిర్మాణం పూర్తిచేసేందుకు మరో గుత్తేదారు వచ్చారు. నిధులు సరిపోకపోవడంతో ఆయన కూడా చేతులెత్తేశారు.

త్వరలోనే అందుబాటులోకి..

యాదగిరిగౌడ్, ఎస్సై, మాక్లూర్

నిధుల సమస్య తప్ప ఏ ఇబ్బంది లేదు. 63వ జాతీయ రహదారిని ఆనుకొని అందరికి అందుబాటులో ఉండి, ప్రమాదాలు నివారించేందుకు ఇక్కడ నిర్మిస్తున్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలోనే ఠాణాను అందుబాటులోకి తెస్తాం.

# నేతల కనుసన్నల్లో వక్ఫ్ స్థలాలు!

గజ్వేల్: గజ్వేల్ పట్టణంలోని వక్ఫ్ బోర్డు స్థలాల్లో అక్రమ నిర్మాణాలకు నియోజకవర్గానికి ఇద్దరు నేతలు గుట్టుగా చక్రం తిప్పుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వారికి, అనుచరులకు కొంత ముట్టజెప్పితే చాలు.. ఎలాంటి నిర్మాణం చేపట్టినా ఇబ్బందులు ఉండబోవని స్థానికులు చర్చించుకుంటున్నారు. వక్ఫ్‌బోర్డు స్థలంలో కొందరు గతేడాది కిందట రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలుసుకున్న బల్దియా అధికారులు జేసీబీలతో కూల్చి వేశారు. ఇప్పుడు అదే పరిసరాల్లో ఏకంగా ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నట్లు కనిపెట్టిన అధికారులు మరోమారు కూల్చివేతలకు దిగటం చర్చనీయాంశంగా మారింది. రూ.కోట్ల విలువ చేసే వక్ఫ్ బోర్డు స్థలాలకు రక్షణ లేకుండా పోతోంది. అక్రమ నిర్మాణాలు ఓ దశకు చేరేవరకు అధికారులు ఎందుకు మిన్నకుండిపోతున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మసీదులు, దర్గాల నిర్వహణకు పూర్వం వక్ఫ్ బోర్డు కేటాయించిన ఈ భూముల్లో నిబంధనలు అతిక్రమించి ఎలాంటి నిర్మాణాలు, క్రయ విక్రయాలు చేయరాదని నిర్ణయించారు. చాలా చోట్ల ఏటా వాణిజ్య సముదాయాలు, ఇళ్ల నిర్మాణాలు సాగిపోతున్నాయి. రెవెన్యూ రికార్డుల ప్రకారం.. పట్టణంలో 292.29 ఎకరాలున్నాయి. ఇందులో 5.25 ఎకరాల్లో మసీదులు, ఈద్గాలు, ఇతర ప్రార్థన మందిరాలున్నాయి. కొంత స్థలం రోడ్ల విస్తరణలో కలిసిపోయింది. కబ్రస్థాన్, పాడుబడిన బావులు, కాలువలు, గుమ్మటాలు తదితరాలు పోనూ మిగతా సుమారు 200 ఎకరాలకుపైగా ఖాళీ స్థలం ఉంటుందని అధికారుల అంచనా. జాలిగామ రోడ్డులో కొంత భూమి సాగులో ఉండగా చాలా చోట్ల ఆక్రమణకు గురైందని స్థానికులు చెబుతున్నారు. పదిహేనేళ్లలో దాదాపు 80 ఎకరాలు ఆక్రమించారని గుర్తించారు. గడచిన రెండేళ్లలో



అక్రమించిన వాటి విలువే రూ.10 కోట్లుంటుంది. నిర్మాణదారులకు పలు మార్లు తాఖీదులు జారీ చేశారు. మిగతావాటిని కాపాడేందుకు యత్నిస్తున్నా నేతలు ఈ భూములపై కన్నేసి, బినామీలతో నిర్మాణాలు చేయిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

తాత్కాలిక చర్యలా... స్థలాల రక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోకపోవటంతో కబ్జాలు ఆగటం లేదు. తాత్కాలికంగా నిర్మాణాలను పాక్షిక ధ్వంసం చేసి ఊరుకుంటున్నారు. తర్వాత యథావిధిగా చేపడుతుండటం గమనార్హం. రెండేళ్ల క్రితం గజ్వేల్ నుంచి తూప్రాన్ రోడ్డులో గోడలు కూల్చేశారు. రెండు నెలల్లో ఆ వ్యక్తి నిర్మాణం పూర్తి చేసి, పాత ఇంటి సంఖ్య వేశారు. చాలాకాలం క్రితమే కట్టుకున్నట్టు బుకాయిస్తున్నాడు. గుమ్మటం సమీపంలో గతేడాది ఇంటిని కూలగొట్టారు. అనంతరం కొద్ది నెలల్లో మళ్లీ నిర్మించారు. సినిమా థియేటర్ సమీపంలో ఓ నేత భారీగా కట్టుకుంటున్నారు. గజ్వేల్ ఇందిరాపార్కు నుంచి తూప్రాన్ రోడ్డులో, జాలిగామ బైపాస్ రోడ్డులో పలు పార్టీలకు చెందిన నాయకులు దుకాణ సముదాయాలు నిర్మించుకున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం: విజయేందర్‌రెడ్డి, ఆర్డీవో, గజ్వేల్‌వక్ఫ్ బోర్డుకు చెందిన స్థలాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దు. ఎక్కడైనా ఉంటే చర్యలు తీసుకుంటాం.

## ప్రగతి సంకల్పం ప్రణాళికతో సాకారం

సంగారెడ్డి: ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాలు అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నాయి. సంక్షేమ పథకాల సద్వినియోగంతో ప్రయోజనం చేకూరుతోంది. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతుండటం కలిసి వస్తోంది. పలు అంశాల్లో ప్రగతి సాధించి మేటిగా నిలవగా, మరికొన్నింట మాత్రం దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. కీలక అంశాల్లో ఇబ్బందులను అధిగమించేందుకు ప్రణాళిక అవశ్యం. తాజాగా 2021-22 సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర అర్థగణాంక శాఖ విడుదల చేసిన నివేదిక ఆయా విషయాలను స్పష్టంచేస్తోంది. ఈ నేపథ్యంలో నాలుగు జిల్లాలోని పరిస్థితిపై ప్రత్యేక కథనం. దూసుకెళ్తున్నాయ్..ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరిగింది. సంప్రదాయ ఇంధన వనరులు భారంగా మారుతుండటంతో ఈ దిశగా అడుగులు పడ్డాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో పలు సంస్థలు ఎలక్ట్రిక్ వాహనాల తయారీని ముమ్మరం చేశాయి. పనితీరు బాగుండటంతో వినియోగం పెరుగుతోంది.

మెతుకుసీమలోనే ఎక్కువ..నాలుగు జిల్లాల్లో పరిశీలిస్తే సంగారెడ్డి జిల్లాలోనే పట్టణ జనాభా ఎక్కువ. మెదక్ జిల్లాలో పల్లెల్లోనే అత్యధికులు జీవిస్తున్నారు.

# అంగన్‌వాడీలకు సాంకేతిక దన్ను





ఖమ్మం : ప్రస్తుతం అన్ని రంగాలు సాంకేతిక పరిజ్ఞానంతో దూసుకెళ్తున్నాయి. ప్రతీ పనిని సులభతరం చేసుకుంటున్నాయి. సంక్షేమ విభాగంలోని అంగన్‌వాడీ కేంద్రాలూ అదే బాటలో పయనిస్తున్నాయి. ఈ కేంద్రాలు తమ పరిధిలో 16 రకాల రిజిస్టర్లను నిర్వహిస్తాయి. గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్య సంబంధిత సమాచార సేకరణ అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు భారమవుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం 'న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టమ్(ఎన్‌హెచ్‌టీఎస్)' యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

నమోదు తప్పనిసరి...అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు విధులకు ఎప్పుడు హాజరవుతున్నారు, ఏ రోజు ఎంతమంది పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు పోషకాహారాన్ని అందించారు అనే అంశాలను పొందుపరచాలంటే సిబ్బంది తమ చరవాణిలో ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని నమోదు చేసుకోవాలి. ఆధార్‌ను అనుసంధానం చేసిన తర్వాత ఒక ఐడీ జనరేట్ అవుతుంది.

ఎందుకీ యాప్....రిజిస్టర్లు, కాగితాల విధానానికి స్వస్తి పలికి, సాంకేతికతను జోడిస్తూ, అంగన్వాడీ కేంద్రాలపై 24/7 అధికారుల పర్యవేక్షణ ఉండేలా ఇది దోహదపడుతుంది. దీంతో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తప్పనిసరిగా ఈ యాప్‌లో నమోదు కావాల్సి ఉంటుంది. కేంద్రాలను టీచర్లు ఎప్పుడు తెరుస్తున్నారు, హాజరవుతున్నారా? లేదా అనే అంశాలు అధికారులకు తెలుస్తాయి. దీంతో పనిలో పారదర్శకత పెరిగే అవకాశం ఉంటుంది. సేవలను పొందే వారందరి సమాచారం ఇందులో నిక్షిప్తమై ఉంటుంది. ఆరోగ్య లక్ష్మీ పథకం ద్వారా గర్భిణులు, బాలింతలు, 6 సంవత్సరాల పిల్లలకు సరైన సమయంలో పాలు, గుడ్లు, బాలామృతం తదితర పోషకాహారం అందిస్తున్నారా? కేంద్రాల్లో సరిపడా ఆహార పదార్థాలు అందుబాటులో ఉన్నాయా? అనే సమాచారాన్ని సిబ్బంది యాప్‌లో పొందుపరుస్తారు.

పర్యవేక్షణ మరింత సులభం...

ఈ యాప్ అందుబాటులోకి రాక ముందు అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా పని చేస్తున్నాయా, ప్రభుత్వం అందించే అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయా, లేవా అనే వివరాలను జిల్లా సంక్షేమ అధికారి, సీడీపీవో, పర్యవేక్షకులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు దేశంలోని ఏ అధికారి అయినా సులభంగా ఎక్కడి నుంచైనా కేంద్రాలను పర్యవేక్షించే అవకాశం ఉంది.

రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు తెచ్చిందంటే...

పోషణ ట్రాకర్ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్. ఇది దేశంలోని అన్ని రాష్ట్రాలలో అందుబాటులో ఉంది. కానీ తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్య లక్ష్మీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం అందించే సేవలు, లబ్ధిదారుల వివరాలను సైతం యాప్‌లో పొందుపరచాలనే ఉద్దేశంతో ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ను రూపొందించారు. అంగన్‌వాడీ కేంద్రాల సేవలు వైద్యం, పంచాయతీరాజ్, గ్రామీణభివృద్ధి శాఖలతో ముడిపడి ఉంటాయి. వీటి సమన్వయం చేసుకుంటూ, పారదర్శకత, నాణ్యతగల సేవలను అందించడం కోసం దీన్ని రూపొందించారు.

వృథాను అరికట్టవచ్చుసీహెచ్ సంధ్య, జిల్లా సంక్షేమ అధికారిగతంలో కేంద్రాలకు ప్రభుత్వం పంపిణీ చేసే పోషకాహార సరకులు పెద్ద మొత్తంలో వృథా అయ్యేవి. అక్రమాలకు తావుండేది. యాప్ వచ్చాక పారదర్శకత పెరిగింది. సరకులు పక్కదారికి పట్టే అవకాశం లేదు.

# వరి.. వెదజల్లు సిరి



ఖమ్మం : వరి సాగులో ఏటా పెట్టుబడులు పెరుగుతుండటం, మరోవైపు ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడల బెడదతో దిగుబడులు క్షీణిస్తుండటం వల్ల అన్నదాతలు నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు కొందరు ప్రత్యామ్నాయ విధానాలు అవలంబిస్తున్నారు. డ్రమ్‌సీడర్, వెదజల్లే పద్ధతితో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకుంటున్నారు.

పెట్టుబడి భారంతో 'ప్రత్యామ్నాయ' అడుగులు

ఉభయ జిల్లాల్లో వరి సాగు సాధారణ విస్తీర్ణం 2.83 లక్షల ఎకరాలు. ఏటా సాగు విస్తీర్ణం తగ్గుతోంది. సంప్రదాయ పద్ధతిలో నాటు వేయడంతో ఎకరాకు రూ.6వేల వరకు ఖర్చవుతోంది. డీజిల్, ఎరువుల ధరలు పెరగడంతో రూ.3వేల వరకు రైతులపై అదనంగా భారం పడుతోంది. మొత్తమ్మీద ఎకరాకు పెట్టుబడి రూ.25వేలు అవుతోంది. దిగుబడి ఆశాజనకంగా ఉంటే ఎకరాకు రాబడి రూ.40వేలు వస్తుంది. కౌలు రూ.8వేల నుంచి రూ.10వేలు పోతే కౌలుదారులకు మిగిలే పరిస్థితి లేదు. గతేడాది ఖరీఫ్‌లో అధిక వర్షాలతో చీడపీడలు సోకి ఎకరాకు 20 బస్తాలు దిగుబడి కూడా రాకపోవటంతో నష్టపోయారు. సాగు వ్యయం తగ్గించుకునే క్రమంలో అధికారుల సూచన మేరకు గత ఖరీఫ్‌లోనే కొందరు అన్నదాతలు వెదజల్లే పద్ధతిని ఎంచుకున్నారు. ఆశించిన దిగుబడులు రావటంతో అధిక మంది ఈవిధానాన్ని రబీలో అనుసరిస్తున్నారు. ఇప్పటికే ఖమ్మం జిల్లాలో 18వేల ఎకరాలు, భద్రాద్రి జిల్లాలో 8వేల ఎకరాల్లో వెదజల్లే పద్ధతి ద్వారా పంటలు సాగైనట్లు వ్యవసాయ శాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువ.. నాటు విధానం ద్వారా ఎకరాకు 25కిలోల వరకు విత్తనాలు అవసరం. వెదజల్లే పద్ధతిలో 12-15 కిలోలు సరిపోతాయి. నాటేసేందుకు కూలీలకు ఎకరాకు రూ.6వేలు అవుతుండగా కొత్త విధానం ద్వారా రూ.600తో సరిపెట్టవచ్చు. నారు పెంచి తిరగ నాటడం వల్ల వేర్లు తెగటంతో పిలకలు ఎక్కువొచ్చే అవకాశం ఉండదు. వెదజల్లే పద్ధతిలో నేరుగా పెరగడం వల్ల దుబ్బులు, కంకులు ఎక్కువొస్తాయి. దిగుబడులు పెరుగుతాయి. వెదజల్లే పద్ధతి అవలంబిస్తే పంట ఆరంభంలో మందులతో కలుపును నివారించవచ్చు. పంట త్వరగా కోతకు వస్తుంది.

జిల్లాలో.. వైరా జలాశయం ఆయకట్టు పరిధిలో రబీలో 18వేల ఎకరాల్లో వరి పండిస్తారు. 10వేల ఎకరాల్లో వెదజల్లే పద్ధతిని అవలంబిస్తున్నారు. ఏన్కూరులో 5వేల ఎకరాల్లో పంట సాగవుతుంది. ఇప్పటికే 3వేల ఎకరాల్లో డ్రమ్‌సీడర్, వెదజల్లే పద్ధతిలో పండిస్తున్నారు. తల్లాడ మండలం వెంకటగిరి, అన్నారుగూడెం, గూడూరు, రామచంద్రాపురం, వెంగన్నపేటలో ఎక్కువ మంది, కొత్త వెంకటగిరిలో రైతులందరూ వెదజల్లే పద్ధతి అవలంబిస్తున్నారు. పెనుబల్లి, కొణిజర్ల, సత్తుపల్లి, వేంసూరు, మధిర మండలాల్లోనూ ఇదే పరిస్థితి. ఐదేళ్లుగా 20ఎకరాలలో వెదజల్లే పద్ధతి ద్వారా వరిసాగు చేస్తున్నా. నాటు వేసే విధానం కంటే సులువు. కూలీల ఖర్చు లేకుండా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధిస్తున్నా. రోజుకు 5ఎకరాలు చొప్పున ఒక్కడినే వెదజల్లుకుంటున్నా. ఈ ఏడాది ఎకరానికి 35-40బస్తాల దిగుబడి వచ్చింది. ఎకరాకు రూ.5వేలకు పైగా ఖర్చు తగ్గుతుంది. డ్రోన్ ద్వారా మందులు పిచికారీ తేలికగా ఉంది. దిరిశాల రాంబాబు, రైతు కొత్తవెంకటగిరి

# పర్యాటకం.. మాటలకే పరిమితం



దేవరకొండ: దేవరకొండ దుర్గాన్ని రాజధానిగా చేసుకొని వెలమ రాజులు సుమారు 149 సంవత్సరాలు స్వయం ప్రతిపత్తి గల రాజ్యంగా పరిపాలించారని చరిత్రకారులు చెబుతుంటారు. 750 ఏళ్ల కిందట దేవరకొండ ఖిల్లా దుర్గం 500 అడుగుల ఎత్తు, 524 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. శత్రు దుర్భేద్యమైన నిర్మాణం, అద్భుత శిల్పకళా నైపుణ్యంతో పశ్చిమ ప్రాకారానికి రహస్యమార్గం ఉంటుంది. చుట్టూ ఆలయాలతో అష్టదిగ్బంధనం ఉండేలా అద్భుతంగా తీర్చిదిద్దారు. గిరి దుర్గం, సురగిరి, దేవతల కొండగా ప్రాచుర్యం పొందింది. కవి సార్వభౌముడు శ్రీనాథుడు సాహితి పక్షపాతులైన దేవరకొండ సామ్రాజ్యాధిపతులను కలవడానికి ఖిల్లాకు వచ్చినట్లు చరిత్ర చెప్తోంది. ఇంతటి చరిత్ర కలిగిన ఈ ప్రాంతాన్ని ప్రస్తుతం పట్టించుకునే నాథుడు కరవయ్యారు. మూడేళ్ల క్రితం ఖిల్లా దుర్గాన్ని అభివృద్ధి చేసేందుకు రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. రూ.50 లక్షలతో సీసీ రహదారి నిర్మాణం చేపట్టారు. మిగతా రూ.50 లక్షలతో మెట్లను సరిచేయాల్సి ఉన్నప్పటికీ గుత్తేదారు వాటిని గాలికి వదిలేశారు.

త్వరలో గుర్తింపునకు చర్యలు-రమావత్ రవీంద్రకుమార్, ఎమ్మెల్యే దేవరకొండ ఖిల్లాను పర్యాటక కేంద్రంగా గుర్తించేందుకు అసెంబ్లీలో ప్రస్తావించాను. పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లాను. తొందర్లోనే పర్యాటక కేంద్రంగా గుర్తించేందుకు చర్యలు తీసుకుంటాం.

# వేలిముద్ర పడాల్సిందే..


కామారెడ్డి : విధులకు గైర్హాజరైనా దస్త్రాల్లో సంతకాలు పెడుతూ వేతనాలు తీసుకుంటున్న బోధన, బోధనేతర సిబ్బంది ఆటలు ఇక చెల్లవు. కొంతకాలంగా బయోమెట్రిక్ విధానానికి దూరంగా ఉన్న యంత్రాంగం గతేడాది సెప్టెంబరు 1 నుంచి అమలు చేయాలని ఆదేశించింది. క్షేత్రస్థాయిలో యంత్రాల పనితీరు సక్రమంగా లేక అమలుకు నోచుకోలేదు. ఎట్టకేలకు కొన్ని కళాశాలల్లో బయోమెట్రిక్‌ను ప్రారంభించగా నుంచి పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నారు. ఈ విధానాన్ని పకడ్బందీగా చేపట్టేలా అధికారులు దృష్టిపెట్టారు.

పక్షం రోజులకు నివేదిక

ఎక్కువసార్లు గైర్హాజరయ్యే వారిపై అధికారులు నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు. రాకపోవడానికి కారణాలను ఆరా తీయనున్నారు. ఉన్నతాధికారులకు సంజాయిషీ ఇచ్చేలా చర్యలు చేపడుతున్నారు. నెలలో రెండుసార్లు నివేదికలు పంపుతారు.

గతంలో జరిగిందిలా

కొందరు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది దస్త్రాల్లో ఒకేసారి రెండు, మూడు రోజుల సంతకాలు పెట్టి బయటకు వెళ్లిపోయేవారు. కళాశాలల్లో విడతల వారీగా విధులు కేటాయించుకునేవారు. ఇది పిల్లల విద్యా



బోధనపై తీవ్ర ప్రభావం చూపింది. పాఠ్య ప్రణాళిక పూర్తికాక వార్షిక ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం తగ్గింది.

వచ్చే సంవత్సరం విద్యార్థులకు

షేక్ సలాం, ఇంటర్ నోడల్ జిల్లా అధికారి-కామారెడ్డి

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పారదర్శకత కోసమే బయోమెట్రిక్ విధానం తీసుకొచ్చాం. ప్రతి అధ్యాపకుడు నిర్దిష్ట వేళల్లో కళాశాలకు వచ్చి వేలిముద్ర ద్వారా హాజరు నమోదు చేయాలి. వచ్చే విద్యాసంవత్సరం విద్యార్థుల హాజరుకు దీనినే అమలు చేస్తాం.

రెండేళ్ల తరువాత

కొవిడ్ కారణంగా రెండేళ్లపాటు బయోమెట్రిక్ అమలుకు అవరోధాలు ఎదురయ్యాయి. ప్రస్తుతం కొవిడ్ కేసులు నమోదుకాకపోవడంతో కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో తిరిగి అమలు చేయాలని నిర్ణయించారు. బోధన, బోధనేతర సిబ్బంది ఉదయం విధులకు వచ్చినప్పుడు, సాయంత్రం తిరిగి వెళ్లేటప్పుడు తప్పనిసరిగా వేలిముద్ర వేయాల్సిందే.

# ఆధునిక యంత్రం.. ఆదా మంత్రం!

సంగారెడ్డి: వడ్లు నానబెట్టి, విత్తనం మొలకెత్తగానే నారు పోసి, ఎదగగానే కాలం చూసుకొని మహిళలు, పురుషులు పొలంలోని బురదలో దిగి.. నాట్లు చేపట్టడం ఒక ఆహ్లాదకరమైన దృశ్యం. యాంత్రీకరణ ప్రభావంతో మెల్లమెల్లగా మహిళా బృందాల నాటు దృశ్యాలు కనుమరుగవుతున్నాయి. యంత్ర వాహనాలతో క్రమపద్ధతిలో వరి నాట్లు సమయానుకూలంగా పూర్తయి దిగుబడులు పెరుగుతున్నాయి. తమిళనాడు నుంచి వచ్చిన వారు యంత్ర వాహనంతో చిన్నకోడూరులోని రైతు మల్లారెడ్డికి చెందిన ఆరు ఎకరాల్లో నాట్లు వేశారు. బెజ్జంకి మండలం నుంచి యంత్రాన్ని అద్దెకు తెచ్చారు.

25 రోజుల్లోనే..

యంత్రం ద్వారా వేసేముందు మొలకలను ప్లాస్టిక్ షీట్లపై పరుస్తారు. 25 రోజులకు నారు తీసి యంత్రంతో వేయాల్సి ఉంటుంది. రోజులు పెరిగితే చేత్తో నాటేయాల్సి ఉంటుంది. పెరిగిన నారు ఉన్న షీట్లను చాపటా చుట్టి యంత్రంలో అమరుస్తారు. పొలంలో నారును



క్రమపద్ధతిలో వాహనం పరుస్తూ షీట్లను వేరు చేస్తుంది. ఒకరోజులో సుమారు 12 ఎకరాలు నాటేయవచ్చు. ఎకరానికి రూ.4 వేలకు పైగా అద్దె తీసుకుంటున్నారు. దీంతో సమయం, డబ్బు ఆదా అవుతుంది. కూలీల కొరతను అధిగమించవచ్చు. మరోవైపు మిరుదొడ్డి మండలంలో వరి నాట్లు వేయడం చివరి దశకు వచ్చింది. మహిళలు బృందంగా ఏర్పడి, కూలీ మాట్లాడుకొని వేస్తున్నారు. నారు ముదరక ముందే నాట్లు పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మల్లేశం సూచిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే సుమారు 90 శాతం పూర్తయ్యాయి. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో త్వరితంగా వేయాలని.. లేకపోతే తెగుళ్లు సోకుతాయని హెచ్చరిస్తున్నారు.

# విద్యుత్‌శాఖ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్

## జీతాలు 37 శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ



తాడేపల్లి: విద్యుత్ శాఖలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వైయస్ జగన్ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. విద్యుత్ శాఖ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలను భారీగా పెంచుతూ ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని విద్యుత్ శాఖ ఔట్‌సోర్సింగ్ ఉ?ద్యోగుల జీతాలు 37 శాతం పెంచింది వైయస్ జగన్ ప్రభుత్వం. ఈ మేరకు విద్యుత్ శాఖ స్పెషల్ సీఎస్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో 27వేల మంది విద్యుత్ శాఖ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం వైయస్ జగన్ ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు పెంచినట్టు విద్యుత్ శాఖ సీఎస్ తెలిపారు. తాజాగా ప్రభుత్వం నిర్ణయంతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతం రూ. 21వేలు దాటింది. అలాగే, గ్రూప్ ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం కాంట్రాక్ట్ ఏజెన్సీలను ఆదేశించింది.




బెంగళూరు (యశ్వంతపుర) : ఆ ఇద్దరి మాటలకు కరిగిపోయిన ఆ పెద్దాయన చివరికి నిలువునా మోసపోయారు. సాయం పొందడమేగాక.. వంచనకూ తెరలేపిన కిలాడీ మహిళల వలపు వలలో ఆయన విలవిలలాడి చివరికి పోలీసులను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళితే.. మా అబ్బాయి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడని, వైద్య చికిత్స కోసం ఆర్థిక సాయం చేయాలంటూ ఓ మహిళ (40) చేసిన ఫోన్‌కు ఆయన (60) మనసు కరిగిపోయింది. గతంలో కాస్త పరిచయం ఉన్న నేపథ్యంలో మాటకలిపి ఆమె అడిగేసరికి కాదనలేక పోయారు. సరేనంటూ ఉత్తరహళ్లి రహదారిలోని ఓ హోటల్‌కు ఆమెను పిలిచి రూ.5 వేల సొమ్ము అందించారు. అక్కడితో ఆ ఇద్దరి మధ్య అనుబంధం కాస్త ముడిపడటం మొదలైంది. ఆమె చెప్పే కష్టాలన్నీ వింటూ ఊరడించడం ఆయనకు అలవాటుగా మారింది. ఇలా ఊరడిస్తూ.. ఓరోజు బాధితుడు ఆమెను ఎలక్ట్రానిక్ సిటీ హెుస్కూర్ గేట్ సమీపంలో ఉన్న ఓ హెుటల్‌కు పిలిపించాడు. గది తీసుకుని అక్కడే ఆ రోజు గడిపారు. ఇలా.. ఆ హెుటల్‌లోనే రెండు, మూడు సార్లు కలిసి కాలం గడపడం ఆయనకు అనుకోని ఇబ్బందులు తెచ్చిపెట్టింది. ఆయనకు తెలియకుండా ఆమె చెల్లి సెల్‌ఫోన్ సాయంతో 'వారిద్దరి వ్యవహారాలు' చిత్రీకరించింది. వారం రోజుల తరువాత చిత్రాలు, వీడియోలు ఆ పెద్దాయన (60)కు పంపి.. మీ రాసలీలలు ఇవీ.. అంటూ బాంబు పేల్చింది. ఆ చిత్రాలు మీ ఇంటికి చేరకుండా ఉండాలంటే కాస్త 'సాయం' చేయాలంటూ బేరం మొదలు పెట్టింది. ఇలా.. బలవంతపు సాయంగా రూ.82 లక్షలు గుంజారు. సతాయింపులు అంతటితో ఆగలేదు. మరో రూ.40 లక్షలు కావాలంటూ ఒత్తిడి పెంచారు. ఆ సొమ్ము ఇవ్వకపోతే నమ్మించి, అత్యాచారానికి పాల్పడ్డావంటూ కేసు పెడతామని హెచ్చరించడంతో ఆయన సంబంధిత పోలీసు ఠాణాకు పరుగులు తీశారు. ఆ ఇద్దరు మహిళల కోసం పోలీసులు గాలింపు ప్రారంభించారు.




ఏలూరు : ఏలూరులో వైద్యుల నిర్వాకం ఓ మహిళ ప్రాణాల మీదికొచ్చింది. జిల్లా బోధనాసుపత్రిలో మహిళ పొట్టలో శస్త్ర చికిత్సకు ఉపయోగించే కత్తెర ఉంచి కుట్లు వేశారు. వివరాల్లోకి వెళితే.. పెదపాడు మండలం ఎస్.కొత్తపల్లి గ్రామానికి చెందిన జి.స్వప్న అనే మహిళ ప్రసవం కోసం ఏప్రిల్ 19న తేదీన ఏలూరు బోధనాసుపత్రిలో చేరింది. ఆమెకు సిజేరియన్ చేసి బిడ్డను బయటకు తీశారు. డిశ్చార్జి అయిన అనంతరం స్వప్న ఇంటికి వెళ్లిపోయింది. అయితే ఆ తర్వాత తరచూ ఆమెకు కడుపులో నొప్పి వచ్చేది. సాధారణంగా వచ్చే నొప్పే అనుకుని మందులు వాడేది. అయితే ఈనెల 8న స్వప్నకు విపరీతమైన కడుపు నొప్పి రావడంతో తిరిగి ఏలూరులోని బోధనాసుపత్రికి చేరుకుంది. అక్కడ వైద్యులు పరీక్షించి విజయవాడ ఆసుపత్రికి సిఫార్సు చేశారు. అక్కడ అసలు విషయం బయటపడింది. ఆమె కడుపులో కత్తెర ఉన్నట్లు ఎక్స్‌రే ద్వారా బయటపడింది. ఏలూరు బోధనాసుపత్రిలో సిజేరియన్ చేసి బిడ్డను బయటికి తీసిన డాక్టర్లు.. ఆపరేషన్‌కు ఉపయోగించిన కత్తెరను కడుపులో ఉంచి కుట్లు వేశారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ శశిధర్‌ను వివరణ కోరగా ఈ విషయం వాస్తవమేనని తెలిపారు. ఆసుపత్రిలో జరిగిన సంఘటనపై ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ స్పందించి విచారణ కమిటీ వేశారు.

# అటల్ చూపిన మార్గంలో నడుస్తాం



విజయవాడ: బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ బీజేపీ చీఫ్ దగ్గుబాటి పురందేశ్వరి అటల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పురందేశ్వరి మాట్లాడుతూ.. అటల్ జీవితం దేశ సేవకు అంకితమయ్యారన్నారు. అటల్ జీవితం బీజేపీ కార్యకర్తకు దిక్సూచిలాంటిదని తెలిపారు. పోఖ్రాన్ అణు పరీక్షలు చేసిన ధీరోధాత్తుడు అని కొనియాడారు. దేశం ఎదుర్కొన్న అతి పెద్ద బానిసత్వానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. చాలా పిన్న వయస్సులోనే సామాజిక కార్యక్రమాలు చేపట్టారన్నారు. నేటి యువత అటల్ స్ఫూర్తితో పని చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీని అధికారంలోకి తెచ్చిన ఘనత అటల్ దే అని చెప్పుకొచ్చారు. సుపరిపాలన అంటే అటల్ గుర్తొస్తారన్నారు. అటల్ చూపిన మార్గంలో నడుస్తామని దగ్గుబాటి పురందేశ్వరి వెల్లడించారు.




బెంగళూరు: జాబిల్లిపై పరిశోధనలకు రోదసిలోకి వెళ్లిన భారత వ్యోమనౌక చంద్రయాన్-3 లక్ష్యం దిశగా విజయవంతంగా దూసుకెళ్తోంది. చంద్రుడి ఉపరితలంపై దిగే చరిత్రాత్మక ఘట్టానికి ఇది మరింత చేరువైంది. బుధవారం జాబిల్లి చివరి కక్ష్యలోకి ప్రవేశించింది. చంద్రయాన్-3 కక్ష్య తగ్గింపు విన్యాసాన్ని నేడు మరోసారి విజయవంతంగా నిర్వహించినట్లు ఇస్రో ప్రకటించింది. నేటి విన్యాసంతో కక్ష్య తగ్గింపు ప్రక్రియలు పూర్తయ్యాయి. జాబిల్లి చుట్టూ చక్కర్లు కొట్టేందుకు ఇదే చివరి కక్ష్య. తాజా విన్యాసంతో వ్యోమనౌక కక్ష్యను 153 %ఎఎ ఇ 163 ఎఎ%లకు తగ్గించినట్లు ఇస్రో వెల్లడించింది. దీంతో ఈ అంతరిక్ష నౌక.. ఇప్పుడు చంద్రుడిపై 100 కిలోమీటర్ల ఎత్తున ఉన్న కక్ష్యలోకి చేరింది. ఇప్పటివరకు ఇస్రో చేపట్టిన దశలన్నీ విజయవంతంగా పూర్తయ్యాయి. ఇక, ఆగస్టు 17న వ్యోమనౌకలోకి ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి ల్యాండింగ్ మాడ్యూల్ విడిపోయే ప్రక్రియను చేపడతారు. అది సజావుగా జరిగితే ల్యాండింగ్ మాడ్యూల్ విడిపోయి సొంతంగా జాబిల్లిని చుట్టేస్తుంది. అంతా సజావుగా సాగితే ఈ నెల 23న సాయంత్రం 5.47 గంటలకు ల్యాండర్ చంద్రుడిపై అడుగుపెట్టనుందని ఇస్రో వెల్లడించింది. 'చంద్రయాన్-3'ని జులై 14న ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ ద్వారా విజయవంతంగా భూకక్ష్యలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. మరుసటిరోజు తొలిసారి దీని కక్ష్యను పెంచారు. ఇలా 18 రోజుల వ్యవధిలో దశలవారీగా అయిదుసార్లు కక్ష్యను పెంచారు. అయిదో భూకక్ష్య పూర్తయిన అనంతరం.. జాబిల్లి దిశగా ప్రయాణానికిగానూ ఆగస్టు 1న 'ట్రాన్స్ లూనార్ కక్ష్య'లోకి ప్రవేశపెట్టారు. అక్కడినుంచి ఆగస్టు 5న విజయవంతంగా చంద్రుడి కక్ష్యలోకి చేర్చారు. క్రమంగా కక్ష్యలను తగ్గిస్తూ చందమామకు చేరువ చేశారు.




**వంగవీటి రాధకు కాబోయే భార్య ఎవరంటే...** అమరావతి : మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ పెళ్లి పీటలు ఎక్కబోతున్నారని తెలుస్తోంది. నర్సాపురానికి చెందిన యువతితో వివాహం నిశ్చయమైందని ఆయన బంధువులు చెబుతున్నారు. తన మిత్రుడి బంధువుల అమ్మాయినే వంగవీటి రాధ వివాహమాడబోతున్నారని పేర్కొంటున్నారు. ఈ నెల 19న నర్సాపురంలో నిశ్చితార్థం, సెప్టెంబర్‌లో రాధాకృష్ణ వివాహమని బంధువుల సమాచారం. వంగవీటి రాధ ప్రస్తుతం టీడీపీలో కొనసాగుతున్నారు. కొంతకాలం పాటు రాజకీయాలకు కాస్త దూరంగా ఉంటూ వచ్చిన ఆయన ఇటీవల తిరిగి యాక్టివ్ అయ్యిన విషయం తెలిసిందే.

# సహాయం చేయకున్నా పర్వాలేదు.. అవమానం వద్దు.. కొడాలిపై అన్నదాతల ఫైర్



కృష్ణా జిల్లా: ఎమ్మెల్యే కొడాలి నానిపై గుడివాడ రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాల కారణంగా నియోజకవర్గంలో నాట్లు మునగలేదని... రైతు నష్టపోలేదని కొడాలి నాని వ్యాఖ్యలపై అన్నదాతలు ఫైర్ అయ్యారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో నాట్లు మునిగాయని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. తమకు సహాయం చేయకున్నా పర్వాలేదు కానీ అవమానపరిచే వ్యాఖ్యలు చేయొద్దని విజ్ఞప్తి చేశారు. 70 ఏళ్లలో ఇంత చిన్న పాటి వర్షానికి తాము ఎప్పుడూ, ఇంతలా నష్టపోలేదని గుడివాడ రైతులు వాపోయారు. రైతులకు టీడీపీ నేత వెనిగండ్ల రాము సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ... చెరువులను తలపించేలా పొలాలు మునిగి.. రైతులకు పెను నష్టం జరిగిందన్నారు. గుడివాడలో నాట్లు మునగలేదని.. రైతులు నష్టం జరగలేదని ఎమ్మెల్యే నాని అనడం బాధ్యతారహిత్యమన్నారు. రైతులంటే ఇంత చులకనా అంటూ మండిపడ్డారు. చేతకాక పోతే కూర్చోండి.. హేళనగా మాట్లాడితే సహించేది లేదని అన్నారు. పకోడీ పురాణం తప్ప, ప్రజల సమస్యలు ఎమ్మెల్యేకు పట్టవని వ్యాఖ్యలు చేశారు. నష్టపోయిన రైతులు వారి కష్టాలు వారు పడుతుంటే... ఎమ్మెల్యే నాని సిగ్గులేని వ్యాఖ్యలు దుర్మార్గమన్నారు. గ్రామాల్లో రైతుల కన్నీరు చూసి గుండె తరుక్కుపోయిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్న తాము ఎక్కడికక్కడ రైతుకు అండగా నిలిచామని తెలిపారు. అధికారంలో ఉన్నా కొడాలి నాని ఏం చేశారని ప్రశ్నించారు. ఇప్పటి వరకు రైతును పరామర్శించలేని ఇలాంటి వ్యక్తి ప్రజాప్రతినిధిగా ఉండడం దౌర్భాగ్యమని వెనిగాండ్ల రాము విరుచుకుపడ్డారు.

# శ్రీకాళహస్తికి 'కొట్టు' వచ్చారని కొట్లు మూయించారు!




శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పర్యటన సందర్భంగా ఆలయ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. మంత్రి వస్తున్నారని దుకాణాలు మూసివేయించారు. శ్రీకాళహస్తీశ్వర ఆలయం నుంచి ధర్మప్రచారానికి శ్రీకారం చుట్టేందుకు మంత్రి కొట్టు వచ్చారు. అయితే మంత్రి రాకను అధికారులు గోప్యంగా ఉంచడంతో పాటు ఆలయ పరిసరాల్లో ఆంక్షలు విధించారు. మంత్రి రాకతో ఉన్నట్లుండి ఆవరణలోని దుకాణాలను మూసివేయించారు. దీంతో భక్తులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. వ్యాపారాలు లేక దుకాణదారులు అవస్థలు ఎదుర్కొన్నారు. దీనిపై ప్రశ్నిస్తే వైకాపా నేతలు, అధికారులు తమ దుకాణాలను శాశ్వతంగా తొలగిస్తారనే భయంతో ఏమీ అడగలేదని వారు తెలిపారు. గతంలో మంత్రి శ్రీకాళహస్తికి వచ్చిన సమయంలో పెద్ద ఎత్తున భక్తుల నుంచి నిరసన ఎదురైంది. ఆ కారణంతోనే మంత్రి పర్యటన వివరాలను గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది.

## అలా చెప్పడానికి సజ్జలకు సిగ్గు లేదా?

విజయవాడ : వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి జరిగిందని.. గతంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని చెప్పడానికి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి సిగ్గు లేదా అని విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు ప్రశ్నించారు. కృష్ణా నది రిటైనింగ్ వాల్ గురించి సజ్జల రామకృష్ణారెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నాడన్నారు. వరదల నుంచి అక్కడి ప్రజలకు రక్షణ కల్పించాలని గతంలో అనేక ధర్నాలు, జల దీక్షలు చేశామన్నారు. 2014లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు కరకట్ట రిటైనింగ్ వాల్ నిర్మాణంపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మూడు విడతలుగా 5 కిలో మీటర్లు మేర రిటైనింగ్ వాల్ నిర్మాణం చేయాలని అప్పుడే చంద్రబాబు చెప్పారని గద్దె రామ్మోహన్ అన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం మొత్తం తామే చేశామని సజ్జల చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. అక్కడి ప్రజలను అడిగితే ఎవరు ప్రారంభించారో చెబుతారన్నారు. అసెంబ్లీలో స్పీకర్ మా గొంతు నొక్కుతున్నారన్నారు. వాస్తవాలు చెప్పే అవకాశం కూడా ఇవ్వడం లేదన్నారు. విజయవాడను అభివృద్ధి చేసింది తెలుగుదేశం పార్టీ అని గద్దె రామ్మోహన్ స్పష్టం చేశారు.



# ఎమ్మెల్సీ అనంతబాబు కేసులో హైకోర్టు తీర్పు రిజర్వ్




అమరావతి: ఎమ్మెల్సీ అనంతబాబుపై ఉన్న హత్య కేసును సీబీఐకి అప్పగించాలంటూ వేసిన పిటిషన్‌పై ఏపీ హైకోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. అనంతబాబు కేసును సీబీఐకి అప్పగించాలని డ్రైవర్ సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. పిటిషన్‌పై ఇరుపక్షాల న్యాయవాదులు వాదనలు వినిపించారు.

సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు మేరకు సీసీటీవి ఫుటేజ్‌లో ఉన్న వారిని సహ నిందితులుగా చేర్చడం లేదా చార్జ్‌షీట్‌లో ఎందుకు పేర్కొనలేదని ధర్మాసనం ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. సీసీటీవీ ఫుటేజ్‌లో ఉన్న వారు ఏం చేశారో చార్జ్‌షీట్‌లో ఎందుకు పేర్కొనలేదని కోర్టు నిలదీసింది. సింగిల్ జడ్జి ఆదేశాల మేరకు ఎటువంటి వివరాలు లేకుండా చార్జ్‌షీట్ ఎలా వేస్తారని హైకోర్టు ప్రశ్నించింది. అనంతబాబు భార్య కూడా సుబ్రహ్మణ్యం మృతదేహాన్ని అప్పగించే సమయంలో పక్కనే ఉన్నారని, సీసీటీవీ ఫుటేజ్‌లో ఉన్నా ఆమె పేరును చార్జ్‌షీట్‌లో ఎందుకు చేర్చలేదని పిటిషనర్ తరపు న్యాయవాది జడ శ్రవణ్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. హత్య జరిగిన స్థలంలో రక్తపు మరకలతో కూడిన మట్టి ఉన్నా.. సేకరించకుండా సాక్ష్యాధారాలను కూడా మాయం చేశారని శ్రవణ్ తెలిపారు.

సహ నిందితులను తప్పించడమే కాకుండా.. సాక్ష్యాధారాలు సేకరించడంలో కూడా పోలీసులు విఫలమయ్యారని శ్రవణ్ వాదనలు వినిపించారు. ఎమ్మెల్సీ అనంతబాబు తరపున వాదనలు వినిపించేందుకు సీనియర్ న్యాయవాది సిద్ధమయ్యారు. కానీ సీనియర్ న్యాయవాది వాదనలు వినేందుకు హైకోర్టు ధర్మాసనం అంగీకరించలేదు.

## మోడ్రన్ మహారాణిలా సమంత స్టన్నింగ్ లుక్

సౌత్ ఇండియన్ స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం ఖుషి మూవీ కంప్లీట్ చేసింది. సినిమాలకి ఏడాదిపాటుగా గ్యాప్ ఇవ్వాలని డిసైడ్ అయిన ఈ బ్యూటీ ప్రస్తుతం ఎలాంటి కమిట్మెంట్ లు చేయలేదు. చేతిలో ఉన్న ప్రాజెక్ట్స్ వరకు కంప్లీట్ చేసింది. ఆ మధ్య ఓ హాలీవుడ్ మూవీలో చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందనే మాట ఆ మధ్య వినిపించింది. అయితే దీనిపై ఎలాంటి అప్డేట్ లేదు. సినిమాల నుంచి కొంతకాలం విశ్రాంతి తీసుకోవాలని డిసైడ్ అయినా కూడా సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్ గా ఉంటుంది. తనకి సంబందించిన అన్ని అప్డేట్స్ ని పంచుకుంటుంది. ప్రస్తుతం వెకేషన్ మూడ్ ని ఎంజాయ్ చేస్తోన్న సమంత మరో విప్పు ఖుషి సినిమాని ఇన్ స్టాగ్రామ్ ద్వారా ప్రమోట్ చేసే చేస్తోంది. అలాగే ఈ మధ్య కాస్ట్యూమ్స్ విషయంలో సమంత చాలా ప్రత్యేకత చూపిస్తుంది. రెగ్యులర్



హీరోయిన్స్ తరహాలో గ్లామర్ షోతో సమంత కనిపించడం లేదు. ఫుల్ ప్యాంట్, షర్ట్ మాత్రమే ఎలివేట్ అయ్యే విధంగా ఫుల్ డ్రెస్ వేస్తోంది. సమంత ప్రస్తుత డ్రెస్సింగ్ స్టైల్ లో మిగిలిన హీరోయిన్స్ లో ఎవరు ఫాలో కావడం లేదు. అందాల ప్రదర్శన కంటే వ్యక్తిత్వాన్ని, కాన్ఫిడెంట్ ని ఎస్టాబ్లిష్ చేసే విధంగా సమంత కాస్ట్యూమ్స్ స్టైల్ ఉన్నాయి. ఓ విధంగా చెప్పాలంటే ఫ్యూచర్ మహారాణి తరహాలో సమంత ఈ డ్రెస్సింగ్ స్టైల్ లో దర్శనం ఇస్తోంది. తాజాగా ఆమె వైట్ కలర్ డ్రెస్ లో ఇన్ స్టాగ్రామ్ లో మెస్మరైజ్ చేస్తోంది. కళ్ళజోడు పెట్టుకొని ప్యాంట్, షర్ట్ తో టక్ వేసి స్టన్నింగ్ లుక్స్ తో కేక పుట్టిస్తోంది. ఈ ఫోటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. సమంత షేర్ చేసిన డిఫరెంట్ డ్రెస్సింగ్ స్టైల్ ఫోటోలని ఇన్ స్టాగ్రామ్ లో ఏకంగా 4.79 లక్షల మంది లైక్ చేయడం విశేషం. సమంత ఎలాంటి కాస్ట్యూమ్ వేసిన వాటికే కొత్త అందం వస్తాయని, ఫ్యాషన్ ప్రపంచంలో ఇప్పుడు సామ్ ట్రెండ్ సెట్టర్ గా ఉందనే మాట వినిపిస్తోంది.

## వరుణ్ తేజ్, లావణ్య పెళ్లి.. మరో ట్విస్ట్?

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి ప్రేమించుకొని పెళ్లి పీటలు ఎక్కడానికి రెడీ అవుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే వీరిద్దరి ఎంగేజ్మెంట్ హైదరాబాద్ లో జరిగింది. కుటుంబం సభ్యుల సమక్షంలోనే ఎంగేజ్మెంట్ నిర్వహించారు. ఇద్దరు ప్రస్తుతం ఉన్న సినిమాలు పూర్తయిన వెంటనే పెళ్లి జరుగుతుందని ప్రచారం నడిచింది. అలాగే ఇటలీలో డెస్టినేషన్ వెడ్డింగ్ ప్లాన్ చేసుకున్నట్లు గతంలోనే క్లారిటీ ఇచ్చారు. వెన్యూ కూడా ఖరారు చేసి ఆగష్టు 24, 25 తేదీలలో పెళ్లి ఉంటుందని ప్రకటించారు. అయితే పెళ్ళికి ఇంకా చాలా తక్కువ సమయం ఉంది. కానీ మెగా ఫ్యామిలీలో ఎలాంటి హడావిడి లేదు. అందరూ సైలెంట్ గా ఎవరి యాక్టివిటీస్ లో వారు బిజీగా ఉన్నారు. వరుణ్ తేజ్ గాండీవదారి అర్జున మూవీ రిలీజ్ కి రెడీ అవుతోంది. నిజానికి మెగా ఫ్యామిలీలో పెళ్లి వేడుక చాలా గ్రాండ్ గా ప్లాన్ చేసుకుంటారు. అది కూడా డెస్టినేషన్ వెడ్డింగ్ కాబట్టి కచ్చితంగా



సందడి ఉంటుంది. పెళ్లికి పది రోజుల ముందు నుంచి సంప్రదాయ పెళ్లి తంతు మొదలవుతుంది. పెళ్లి శుభలేఖలు కూడా ఈపాటికే ముందించేసి ఉండాలి. అయితే ఇవేమీ కూడా ప్రస్తుతం కనిపించడం లేదు. దీంతో వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి పెళ్లి వాయిదా పడిందని అందరూ భావిస్తున్నారు. అధికారికంగా మెగా ఫ్యామిలీ నుంచి ఎలాంటి క్లారిటీ రాకపోయిన కూడా ప్రస్తుత వాతావరణం చూస్తుంటే అలానే కనిపిస్తోంది. అటు లావణ్య త్రిపాఠి ఫ్యామిలీ నుంచి కూడా ఎలాంటి స్పందన లేదు. పెళ్లి డేట్ ఫిక్స్ చేసిన కూడా నిహారిక విడాకులు అయిన కొద్ది రోజులకే మరల ఈ సెలబ్రేషన్ అంటే బాగుండదు అని భావించి నాగబాబు అభ్యర్ధన మేరకు పెళ్లి వాయిదా వేసినట్లు తెలుస్తోంది. నిహారిక ప్రస్తుతం విడాకుల డిప్రెషన్ నుంచి బయటకొచ్చే పనిలో ఉంది. దానికోసం ఫ్రెండ్స్ తో కలిపి వెకేషన్స్ కి వెళ్తూ కంప్లీట్ గా ఆ మూడ్ నుంచి బయటపడాలని భావిస్తోంది. మెగా ఫ్యామిలీ కూడా నిహారికకి మానసిక స్థైర్యం ఇస్తున్నారు. కంప్లీట్ గా విడాకుల మూడ్ నుంచి ఫ్యామిలీ మొత్తం బయటకొచ్చాక టైం చూసుకొని పెళ్లి డేట్ ఫిక్స్ చేయాలని అనుకుంటున్నారంట. అందుకే ప్రస్తుతం అనుకున్న డేట్స్ క్యాన్సిల్ చేసి పెళ్లి వాయిదా వేసినట్లు తెలుస్తోంది. లావణ్య, వరుణ్ తేజ్ కూడా దీనికి సమ్మతించినట్లు టాక్.




## బాక్సాఫీస్.. డిసెంబర్ లో పెద్ద లిస్టే ఉందే..



ప్రతి ఏడాది వందల సంఖ్యలో సినిమాలు ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో తెరకెక్కుతూ ఉంటాయి. వాటిలో టాలీవుడ్ లో కూడా చిన్న, పెద్ద చిత్రాలు కలుపుకొని తక్కువలో తక్కువ 300 సినిమాల వరకు రిలీజ్ అవుతూ ఉంటాయి. ఏడాదిలో ఉన్నదీ 365 రోజులు. టాలీవుడ్ లో సినిమాలు ఎక్కువగా రిలీజ్ ఐయ్యేది ప్రతి శుక్రవారం. ఆ రోజైతే వీకెండ్ వస్తుందని మెజారిటీ చిత్రాలు శుక్రవారం రిలీజ్ అవుతూ ఉంటాయి. అవి కాకుండా ఫెస్టివల్ సీజన్ సినిమాల పండగ ఉంటుంది. ఇలా రిలీజ్ అయ్యే సినిమాలలో 10 నుంచి 15 శాతం మాత్రమే హిట్ టాక్ తెచ్చుకుంటాయి. ఒక్కో నెలలో అయితే గ్యాప్ లేకుండా వరుసగా సినిమాలు రిలీజ్ అవుతూ ఉంటాయి. ఒకే రోజు మూడు, నాలుగు సినిమాలు రిలీజ్ అయ్యే సందర్భాలు కూడా ఉంటాయి. అలాగే ఈ ఏడాది డిసెంబర్ నెలలో టాలీవుడ్ లో మూవీ ట్రాఫిక్ ఎక్కువగా ఉందనే చెప్పాలి. డిసెంబర్ 1న రణబీర్ కపూర్ పాన్ ఇండియా మూవీ యానిమల్ రిలీజ్ అవుతోంది. అర్జున్ రెడ్డి ఫేమ్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ఈ సినిమా వస్తూ ఉండటం కొంత బజ్ ఉంది. డిసెంబర్ 8న మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ ఆపరేషన్ వాలంటైన్ రిలీజ్ కాబోతోంది. దాంతో పాటు విశ్వక్ సేన్ గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి కూడా డిసెంబర్ 8న రాబోతోంది. నెక్స్ట్ ధనుష్ పాన్ ఇండియా మూవీ కెప్టెన్ మిల్లర్ డిసెంబర్ 15న రిలీజ్ కానుంది. ఈ చిత్రంలో అంచనాలు గట్టిగానే ఉన్నాయి. నేచురల్ స్టార్ నాని హాయ్ నాన్న డిసెంబర్ 21న ప్రేక్షకులని పలకరించనుంది. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ నానికి జోడీగా నటిస్తోంది. శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకటేష్ హీరోగా తెరకెక్కుతోన్న పాన్ ఇండియా మూవీ సైంధవ్ డిసెంబర్ 22న రిలీజ్ కి సిద్ధం అవుతోంది. సిదీర్ బాబు మైథలాజికల్ ఫిక్షనల్ మూవీ హరోంహర కూడా అదే రోజు రిలీజ్ కి అవ్వబోతోంది. డిసెంబర్ 23న వక్కంతం వంశీ దర్శకత్వంలో నితిన్ హీరోగా తెరకెక్కుతోన్న ఎక్స్ట్రా మూవీ రిలీజ్ అవ్వనుంది. ఇలా డిసెంబర్ నెలలో మొదటి మూడు వారాల్లోనే ఏకంగా ఎనిమిది సినిమాలు తెలుగు ప్రేక్షకులని అలరించడానికి సిద్ధమవుతున్నాయి. వీటిలో దేనికదే ప్రత్యేకమైన మూవీ. డిఫరెంట్ జోనర్ లో ప్రేక్షకులని అలరించడానికి సిద్ధమవుతున్నాయి. మరి ఈ సినిమాల విషయంలో ఆడియన్స్ టేస్ట్ ఎలా ఉంటుందనేది చూడాలి.

## దేవర.. అందరూ అప్పుడే వస్తే ఎలా?




వచ్చే ఏడాది రిలీజ్ కోసం ఇప్పటి నుంచి టాలీవుడ్ లో పోటీ వాతావరణం నెలకొంది. ముఖ్యంగా స్టార్ హీరోల చిత్రాలు అన్ని కూడా ముందుగానే రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకుంటూ షూటింగ్ జరుపుకుంటాయి. అలా డేట్ ప్లాన్ చేసుకోవడం వలన రిమైండర్ లా దానిని దర్శకులు భావిస్తారు. వేగంగా మూవీ షూటింగ్ కంప్లీట్ చేసే ప్రయత్నం చేస్తారు. ఈ మధ్యకాలంలో ముందుగానే రిలీజ్ డేట్ ఎనౌన్స్ చేసేయడం టాలీవుడ్ లో ఆనవాయితీగా వస్తోంది. గతంలో సినిమా కంప్లీట్ చేసి పోస్ట్ ప్రొడక్షన్ కూడా పూర్తయిన తర్వాత మంచి డేట్ నిర్ణయించుకొని మూవీ రిలీజ్ చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. పోటీ వాతావరణం ఎక్కువ అయిపోతుంది. ఇప్పుడు పాన్ ఇండియా కల్చర్ కూడా పెరగడంతో ఇతర భాషా చిత్రాలు కూడా తెలుగులో రాణిస్తున్నాయి. మన సినిమాలు మిగిలిన భాషలలో సత్తా చాటుతున్నాయి. ఈ నేపథ్యంలో రిలీజ్ డేట్ అనేది ఇప్పుడు చాలా ముఖ్యం అయిపొయింది. జూనియర్ ఎన్టీఆర్ దేవర మూవీ ఏప్రిల్ 4 న రిలీజ్ చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. అయితే దేవర సినిమాకి పోటీగా ఇప్పుడు చాలా సినిమాలు వస్తున్నట్లు తెలుస్తోంది. సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ చేస్తోన్న పుష్ప 2 మూవీని ఏప్రిల్ లోనే రిలీజ్ చేయాలని అనుకుంటున్నారు. ఇంకా అఫీషియల్ డేట్ అయితే కన్ఫర్మ్ కాలేదు. సుజిత్ దర్శకత్వంలో పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతోన్న పాన్ ఇండియా మూవీ ఓజీ కూడా ఏప్రిల్ లోనే రిలీజ్ అవుతుందనే ప్రచారం నడుస్తోంది. మెగాస్టార్ చిరంజీవి కళ్యాణ్ కృష్ణ కురసాల దర్శకత్వంలో ఒక సినిమాని స్టార్ట్ చేయబోతున్నారు. ఈ మూవీ కూడా ఏప్రిల్ లో రిలీజ్ అయ్యే ఛాన్స్ ఉందనే మాట వినిపిస్తోంది. రామ్ చరణ్, శంకర్ కాంబోలో సిద్ధమవుతోన్న గేమ్ చేంజర్ ని దిల్ రాజు ఏప్రిల్ లో రిలీజ్ చేయాలని యోచిస్తున్నారు. ఇలా చూసుకుంటే ఎన్టీఆర్ కి పోటీగా ఏప్రిల్ లో ముగ్గురు మెగా హీరోలు సిద్ధమవుతున్నారు. వీరిలో ఒకరైన కచ్చితంగా వచ్చే ఛాన్స్ ఉందనే మాట వినిపిస్తోంది. ఇవన్నీ కూడా భారీ బడ్జెట్ చిత్రాలే. ఏప్రిల్ నెలలో వరుసగా సెలవులు వస్తూ ఉండటంతో దర్శకులు ఇప్పటి నుంచే ప్లాన్ చేసుకొని స్లాట్ బుక్ చేసుకుంటున్నారు. ఈ పోటీలో ఎవరు నిలబడతారు. ఎవరు వెనక్కి వెళ్ళిపోతారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## తెలుగు హీరోయిన్ హాట్ హాట్ ఫొటోషూట్స్!

హీరోయిన్ ప్రియా వడ్లమాని అంటే గుర్తుపట్టకపోవచ్చుగానీ.. 'హుషారు'లో తన లవర్?కు హ్యాండ్ ఇచ్చిన అమ్మాయి అనగానే ఎవరైనా టక్కున గుర్తుపట్టేస్తారు. ఈ చిత్రం, ఆ పాత్ర ఆమెకు మంచి గుర్తింపును తీసుకొచ్చింది. అయితే ఈ తెలుగమ్మాయి 2018లో 'ప్రేమకు రెయిన్ చెక్' అనే చిత్రంతో హీరోయిన్?గా టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. అయితే ఈ ముద్దుగుమ్మకు చెప్పుకోదగ్గ హిట్లేమి లేవు. గ్లామర్ పరంగా ఆకట్టుకునే విధంగా ఉన్నా ఎందుకో పూర్తి స్థాయిలో అంతగా అవకాశాలు రావట్లేదు. ఒకవేళ వచ్చినా అవి బోల్తా కొడుతున్నాయి. అయితే ఈ ముద్దుగుమ్మ సోషల్?మీడియాలోనూ బాగానే యాక్టవ్?గా ఉంటుంది. హాట్ హాట్ ఫొటోషూట్స్ చేస్తూ హడావుడి చేస్తుంటుంది. తాజాగా జీన్స్ ప్యాంట్– ఫుల్ టాప్ లేకుండా ఓన్లీ బ్రా టైప్ లాంటి టాప్ మాత్రమే ధరించి ఫొటోలకు ఫోజులిచ్చింది.



నడుము, నాభి అందాలను బాగా హైలెట్ చేస్తోంది. బ్యాక్, సైడ్ యాంగిల్ లో స్టిల్స్ ఇచ్చి అబ్బురపరిచింది. ఆ పిక్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఫుల్? వైరల్ అవుతున్నాయి. ఇవి చూసిన నెటిజన్లు టాప్ లేకుండా షాక్ ఇచ్చావ్ పాప, స్టన్నింగ్ అంటూ ఫుల్ కామెంట్లు పెడుతున్నారు. ఇక ఈ ముద్దుగుమ్మ.. తన మొదటి సినిమా తర్వాత శరత్ నర్వాడే దర్శకత్వంలో 'శుభలేఖలు' చేస్తే.. అది కూడా వర్కౌట్ అవ్వలేదు. కానీ ఆ తర్వాత చేసిన 'హుషారు' అయితే ఆమెకు ఓ చిన్న గుర్తింపు తెచ్చిపెట్టింది. ముఖ్యంగా ఈ సినిమాలోని 'అందం అమ్మాయైతే నీలా ఉందా అన్నట్టుటే ఉందే ' అంటూ వచ్చే పాట ఈ ముద్దుగుమ్మకు యూత్‌లో మంచి గుర్తింపు తీసుకొచ్చింది. ఇక 'హుషారు' తర్వాత 'ఆవిరి', 'కాలేజ్ కుమార్' అంటూ మరో రెండు చిత్రాలు చేసింది. అవి కూడా బోల్తా కొట్టాయి. ఇక గతేడాది చివర్లో కలర్ ఫోటో దర్శకుడి 'ముఖచిత్రం' సినిమాలో డిఫరెంట్ షేడ్స్?లో ఉన్న రెండు పాత్రల్లో నటించి మెప్పించింది. ఈ సినిమా పర్వాలేదనిపించింది. ఆమె యాక్టింగ్ కూడా బాగానే ఉంది.

## 47లో బద్రి హీరోయిన్ కు బిగ్ హిట్

పవన్ కళ్యాణ్ భద్రి సినిమాలో హీరోయిన్ గా చేసిన అమీషా పటేల్ ని అంత ఈజీగా ఎవరూ మరిచిపోరు. ఆమె కెరియర్ ఆరంభంలో భద్రి సినిమాలో నటించి సూపర్ హిట్ అందుకుంది. తరువాత హిందీలో గద్దర్ మూవీతో హిట్ పడటంతో స్టార్ హీరోయిన్ గా మారిపోయి అక్కడ వరుస అవకాశాలతో దూసుకుపోయింది. ఏకంగా దశాబ్ద కాలం స్టార్ హీరోయిన్ గా బాలీవుడ్ లో చక్రం తిప్పింది. తెలుగులో కూడా మధ్యలో మహేష్ బాబుతో నాని, ఎన్టీఆర్ తో నారసింహుడు సినిమాలలో నటించింది. ఈ రెండు డిజాస్టర్ అయ్యాయి. రెండు దశాబ్దాలుగా హీరోయిన్ గా తన ప్రస్తానం కొనసాగిస్తోన్న ఈ అందాల భామ లేటు వయస్సులో ఇన్ స్టాగ్రామ్ లో హాట్ బాంబ్ గా మారిపోయింది. కుర్ర హీరోయిన్స్ కి పోటీ ఇస్తూ అందాల ప్రదర్శనలో ఎలాంటి హద్దులు పెట్టుకోకుండా తనని తాను షోకేస్ చేసుకుంటోంది. 47 ఏళ్ళ వయస్సులో వన్నె తగ్గని అందాలతో అమీషా పటేల్ చేసే గ్లామర్ షోకి విపరీతమైన ఫాలోయింగ్ ఉంది. ఇంత వయస్సు వచ్చిన ఆమె ఇంకా పెళ్లి చేసుకోలేదు. నటిగానే



కెరియర్ ని మరింత బిల్డ్ చేసుకునే పనిలో ఉన్నారు. తాజాగా గద్దర్ కి సీక్వెల్ గా వచ్చిన గద్దర్ 2తో ఆమె మళ్ళీ హీరోయిన్ గా ప్రేక్షకుల ముందుకి వచ్చింది. ఈ సినిమాలో సన్నీడియోల్ హీరో. 2001లో లవ్ అండ్ యాక్షన్ మూవీగా గద్దర్ వచ్చింది. దానికి సీక్వెల్ గానే గద్దర్ 2 తాజాగా రిలీజ్ అయ్యింది. మొదటి సినిమా హిట్ కారణంగా సీక్వెల్ పైన మంచి హైప్ ఉంది. దీంతో అవుట్ డేటెడ్ యాక్టర్స్ అయిన కూడా మొదటి రోజు ఈ చిత్రం ఏకంగా 40 కోట్లు కలెక్ట్ చేసింది. అయితే ఈ సినిమా కథ, కథనం కూడా రొటీన్ స్టైల్ లో ఉందనే మాట వినిపిస్తోంది. వీకెండ్ మూడు రోజులు ఈ చిత్రానికి కొంత వరకు ఆదరణ వస్తుందని భావిస్తున్నారు. ఈ మూవీ హిట్ అయితే మాత్రం అమీషా పటేల్ కి మళ్ళీ నటిగా అవకాశాలు పెరిగే ఛాన్స్ అయితే ఉంది. హీరోయిన్ గా కాకపోయిన మంచి ప్రాధాన్యత ఉన్న పాత్రలు దొరుకుతాయి. మరి అమీషా పటేల్ కి గద్దర్ 2 ఏ విధంగా ఉపయోగపడుతుందనేది చూడాలి.




# వరంగల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం...

వర్ధన్నపేట: వరంగల్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వరంగల్ నుంచి తొర్రూరు వైపు వెళ్తున్న ఆటోను.. ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు మృత్యువాతపడ్డారు. వర్ధన్నపేట మండలం ఇల్లంద వద్ద ఈ ప్రమాదం జరిగింది. నలుగురు ఘటనాస్థలంలో.. ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జైంది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధితులు తేనె విక్రయించే కూలీలుగా సమాచారం. మృతుల్లో ముగ్గురు శివనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ శ్రీనివాస్ (30), అమీర్, గగన్‌లుగా గుర్తించారు. మరో ముగ్గురి వివరాలు తెలియాల్సి ఉంది. రాజస్థాన్‌కు చెందిన డ్రైవర్.. మద్యం మత్తులో లారీని నడపడమే ప్రమాదానికి కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు.

## బీఆర్ఎస్ అంటే ఇంటిపార్టీ.. కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మి మోసపోవద్దు : ఎమ్మెల్సీ కవిత



నిజామాబాద్ : బీఆర్ఎస్ అంటే మన ఇంటి పార్టీ అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. మనది పేగుబంధం.. వాళ్లది ఓటు బంధం అని వివరించారు. సీఎం కేసీఆర్ రైతుబాంధవుడు అని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా బోధన్ ఎన్ఎస్ఎఫ్ మైదానంలో నిర్వహించిన బీఆర్ఎస్ బూత్ కమిటీ సభ్యుల సమావేశానికి ఎమ్మెల్యే షకీల్‌తో కలిసి ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల శంఖారావం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. గులాబీ జెండా ఉత్సాహాన్ని బోధన్ ప్రజలు మరోసారి చూపించారని వ్యాఖ్యానించారు. మనం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని పార్టీ కార్యకర్తలకు ఆమె సూచించారు. తెలంగాణలో ప్రతి కులానికి ఆత్మగౌరవ భవనం నిర్మించుకున్నామని అన్నారు. బోధన్‌లో 10వేల మంది బీడీ కార్మికులకు పెన్షన్ అందిస్తున్నామని పేర్కొన్నారు. బోధన్‌లో 152 చెరువులను బాగు చేసుకున్నామని తెలిపారు. నిజామాబాద్‌కు ఐటీ హబ్ తీసుకొచ్చామని గుర్తు చేశారు. ఇక్కడికి గూగుల్, ఇన్ఫోసిస్ కంపెనీలను కూడా తీసుకొస్తామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో గెలిస్తే తెలంగాణలో రూ.4వేల పెన్షన్ ఇస్తామని రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీని సైతం ఎమ్మెల్సీ కవిత ఈ సందర్భంగా ప్రస్తావించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రూ.4వేల పెన్షన్ ఇస్తున్నారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ నేతల మాటలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు.

## ఇండ్లు లేని నిరుపేదలకు గుడ్‌న్యూస్ చెప్పిన కేటీఆర్.. వారంలోనే తొలిదశలో..!



ఇండ్లు లేని నిరుపేదలకు రాష్ట్ర ఐటీ, మున్సిపల్‌శాఖల మంత్రి కేటీఆర్ శుభవార్త వినిపించారు. డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీపై కేటీఆర్ బుధవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారంలో తొలి విడుతలో డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు వెరిఫికేషన్ ప్రక్రియ దాదాపు పూర్తి కావొచ్చిందన్నారు. జీహెచ్ఎంసీలో లక్ష ఇండ్ల నిర్మాణం వేగంగా జరుగుతోందని చెప్పారు.

ఇప్పటికే 4,500 ఇండ్ల పంపిణీ పూర్తయ్యిందని చెప్పారు. 70 వేల ఇండ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. 70వేల ఇండ్లను ఐదారు దశల్లో లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. వచ్చే వారంలోనే తొలి దశ ఇండ్ల పంపిణీ ప్రక్రియను ప్రారంభించనున్నట్లు చెప్పారు. సమావేశంలో మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, ఎమ్మెల్యే పద్మారావు, జీహెచ్ఎంసీ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

# ప్రధాని మోదీపై పొన్నాల లక్ష్మయ్య ఫైర్



హైదరాబాద్: ప్రధాని మోదీపై తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత పొన్నాల లక్ష్మయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. పొన్నాల మీడియాతో మాట్లాడారు. "ఎర్రకోట ప్రసంగాన్ని ప్రధాని మోదీ రాజకీయాల కోసం వాడుకున్నారు. మణిపూర్‌లో శాంతి నెలకొంటుంది అంటున్న ప్రధాని పార్లమెంట్ సమావేశాల్లో మణిపూర్ అంశం ఎందుకు మాట్లాడలేదు. ప్రధాని.. మణిపూర్‌లో పర్యటించి ప్రజలకి విశ్వాసం కలిగించి ఉంటే బాగుండేది. ఏమి చేయలేదు కానీ ఎర్రకోట వేదికగా మణిపూర్ గురించి మోదీ మాట్లాడారు. ప్రధాని మోదీ, బీజేపీ నాయకులు ఎవరైనా మణిపూర్‌లో పర్యటించారా?, కోవిడ్ సమయంలో ప్రధాని ఏం చేశారు. గంట కొట్టారు.. దీపాలు పెట్టారు.. చప్పట్లు కొట్టారు. దానివల్ల కోవిడ్ ఏమైనా తగ్గిందా?. కోట్లాది మంది ప్రజలు పాదయాత్రలు, సైకిల్ యాత్రల ద్వారా తమ గమ్య స్థలాలకు చేరుకున్నారు. కోవిడ్ సమయంలో వ్యాక్సిన్ గురించి మాట్లాడుతున్నారు తప్ప లక్షలాది మంది ప్రజల ఉద్యోగాలు కోల్పోయారు. తమ పిల్లలతో సహా తమ స్వస్థలాలకు వెళ్లారు. కేంద్ర, రాష్ట్రాలు గ్యాస్, పెట్రోల్, డీజిల్ పైన ట్యాక్స్ ఎందుకు తగ్గించడం లేదు. దేశం జనాభాలో 90 శాతం మంది సామాన్య ప్రజలే జీఎస్టీ కడుతున్నారు.

ఐదేళ్లలో రైతుల ఆదాయం రెట్టింపు.. 2 కోట్లు ఉద్యోగాలు.. నల్ల ధనం లేకుండా చేస్తాం.. ఇల్లు.. విద్యుత్.. నీరు.. దేశంలో ప్రతి ఒక్కరికీ అందిస్తామని చెప్పారు. ఏమైనా నెరవేర్చరా?, 9 ఏళ్ల పాలనలో మహిళల రిజర్వేషన్ బిల్లు పెండింగ్‌లో ఉంది. బీజేపీకి అవకాశం ఉన్నా ఎందుకు చేయడం లేదు. పార్టీ ఫిరాయింపుల చట్టం 9 ఏళ్లు నుంచి పెండింగ్‌లో ఉంది. 9 రాష్ట్రాల ప్రభుత్వాలను కూలగొట్టిన నీచ ప్రభుత్వం బీజేపీది." అని పొన్నాల ధ్వజమెత్తారు.

# అది రుణమాఫీ కాదు వడ్డీమాఫీ మాత్రమే



యదాద్రి: ప్రతి పార్లమెంట్ పరిధిలో రెండు సీట్లు బీసీలకు ఖచ్చితంగా ఇవ్వాలని సోనియా గాంధీ, రాహుల్ గాంధీ చెప్పారని భువనగిరిలో ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ కేబినెట్‌లో ఎక్కువ మంది ఓసీలే ఉన్నారన్నారు. కేసీఆర్ చేసింది రుణమాఫీ కాదు వడ్డీ మాఫీ మాత్రమే అని మండిపడ్డారు. ఔటర్ రింగ్ రోడ్డును కాంట్రాక్టర్లు అప్పగించి ఆ డబ్బులతో రుణమాఫీ చేశారని విరుచుకుపడ్డారు. తనకు ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రి, ముఖ్యమంత్రి పదవి అవసరం లేదని... పిల్లల బతుకు తెలంగాణ కావాలన్నారు. గుత్తా సుఖేందర్ రెడ్డి వియ్యంకుడికి గంధమల్ల రిజర్వాయర్ పనులు అప్పగించారని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు.

## కేటీఆర్ ఖబడ్దార్ అంటూ వార్నింగ్ ఇచ్చిన మాజీ మంత్రి షబ్బీర్ అలీ



హైదరాబాద్ : మంత్రి కేటీఆర్ ఖబడ్దార్ అంటూ మాజీ మంత్రి షబ్బీర్ అలీ వార్నింగ్ ఇచ్చారు. నేడు గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్ వ్యాఖ్యలపై ఫైర్ అయ్యారు. ఎన్నికల సమయంలో కేసీఆర్‌ని ప్రజలు తరిమి తరిమి కొట్టకపోతే తన పేరు మార్చుకుంటానన్నారు. తెలంగాణకి కాంగ్రెస్ ఏం చేసిందో మీ నాయనని అడగమని కేటీఆర్‌కి షబ్బీర్ చెప్పారు. పొలిటికల్‌గా కేసీఆర్‌కి జన్మనిచ్చింది కాంగ్రెస్ అన్నారు. కామారెడ్డిలో కాంగ్రెస్, షబ్బీర్ అలీ ఏం పీకారని కేటీఆర్ అనడం సిగ్గుచేటన్నారు. ఉద్యమం టైంలో కేటీఆర్ అమెరికాలో ఉన్నాడని షబ్బీర్ అలీ తెలిపారు. తాను ఏం పీకానో అసెంబ్లీలో కేసీఆర్ చెప్పారన్నారు. కేసీఆర్ కుటుంబానికి ఉండడానికి ఇల్లు కూడా లేదని... ఇప్పుడు కోటీశ్వరులు అయ్యారని షబ్బీర్ అలీ అన్నారు. కాంగ్రెస్ ఓఆర్ఆర్ వేస్తే.. బీఆర్ఎస్ నాయకులు సంపాదించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ భూములు అమ్మి ఏం చేయాలనుకుంటున్నారని ప్రశ్నించారు. కేటీఆర్ 100 రోజుల తరువాత ఎక్కడ ఉంటావో చూసుకోమన్నారు. కేటీఆర్ కి తగిన బుద్ధి త్వరలోనే చెబుతామన్నారు. కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేస్తానంటే ఆయన ఇష్టమన్నారు. తాను కాంగ్రెస్ తరపున కామారెడ్డి నుండే పోటీ చేస్తున్నానని షబ్బీర్ అలీ తెలిపారు.




వికారాబాద్ : వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి కొండలు ఆహ్లాదకర వాతావరణానికి, ఆధ్యాత్మికతకు నిలయం. అలాంటిది మంగళవారం నగరం నుంచి వచ్చిన కొందరు యువకులు కార్లు, బైక్ పందాలతో అలజడి సృష్టించారు.

ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అనంతగిరి వ్యూ పాయింట్ల దగ్గర బైక్, కారు పందాలు (రేసులు) పెట్టుకొని స్థానికులను, సందర్శకులు భయభ్రాంతులకు గురిచేశారు. సాహసోపేతమైన విన్యాసాలతో కార్లు, బైక్‌లు చేసే పెద్ద పెద్ద శబ్దాలతో దుమ్ము రేపారు. పందాలకు అటు పోలీసు, ఇటు అటవీశాఖ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని తెలిసింది. నిత్యం అనంతగిరిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఓ ఎస్ఐ, సిబ్బందితో కూడిన ప్రత్యేక సంచార వాహనాన్ని ఏర్పాటు చేసి గస్తీ నిర్వహిస్తున్నారు.

వీరుకూడా లేకపోవడంతో మరింత చెలరేగిపోయారు. పోలీసు, అటవీ అధికారులు సంయుక్తంగా చర్యలు తీసుకొని వీటిని నివారించాలని పర్యాటకులు, ప్రజలు కోరుతున్నారు.


# సీఎం కేసీఆర్ మెదక్ పర్యటన 23వ తేదీకి వాయిదా



ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మెదక్ జిల్లా షెడ్యూల్‌లో మార్పులు చోటు చేసుకున్నది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 19న మెదక్ జిల్లాలో పర్యటించాల్సి ఉంది. అదే రోజున భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ మేరకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

నేపథ్యంలో పర్యటనలో 23వ తేదీకి వాయిదా వేసినట్లు మెదక్ కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. పర్యటనలో సీఎం కేసీఆర్ కొత్తగా నిర్మించి సమీకృత కలెక్టరేట్ కార్యాలయం, జిల్లా పోలీస్ ప్రధాన కార్యాయాలకు ప్రారంభోత్సవం చేయనున్నారు. దాంతో బీఆర్ఎస్ జిల్లా కార్యాలయాన్ని సైతం ప్రారంభించనున్నారు.

## బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలకు భూముల కేటాయింపుపై హైకోర్టులో విచారణ




హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలకు భూముల కేటాయింపు సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌పై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లో టీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల కోసం చౌకగా భూములు అమ్మకాలు చేశారంటూ పిల్ దాఖలైంది. బుధవారం విచారణ జరుగగా.. ప్రభుత్వ భూమిని ప్రజలకు ఎకరం రూ.100 కోట్లకు అమ్మకాలు చేసిందని... అదే బీఆర్ఎస్ పార్టీకి అతి తక్కువ ధరకు రాష్ట్ర ప్రభుత్వం అమ్మకాలు చేసిందని పిటిషనర్ తరపు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర రావు ఈ కేసులో కౌంటర్ దాఖలు చేయడం లేదని కోర్టుకు పిటిషనర్ తెలిపారు. 16 నెలల క్రితమే నోటీసులు ఇచ్చినప్పటికీ కౌంటర్ దాఖలు చేయడం లేదని అభ్యంతరం తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ కోసం కేటాయించిన భూముల్లో నిర్మాణాలు చేపడితే ప్రజలకు ఇబ్బంది తలెత్తుతుందని వాదించారు. ప్రజలకైతే రూ.100 కోట్లకు.. టీఆర్ఎస్ పార్టీకి అయితే చదరపు అడుగు రూ.100 రూపాయలకే అమ్మకాలు చేశారని కోర్టుకు తెలిపారు. అయితే రూలింగ్ పార్టీని కౌంటర్ దాఖలు చేయాలని బలవంతం చేయక్కర్లేదని హైకోర్టు చెప్పింది. ప్రజలకు ప్రభుత్వ భూమిని ఎంత రేటుకు అమ్మకాలు చేశారో అదే రేటు బీఆర్ఎస్ పార్టీ చెల్లించాల్సి ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది. తీసుకున్న భూమికి ఎకరాకు 100 కోట్ల రూపాయలు చెల్లించాలని బెంజ్ మార్క్ తీర్పు ఉందని న్యాయస్థానం గుర్తుచేసింది. మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు ఆదేశాలు జారీ చేస్తూ తదుపరి విచారణను హైకోర్టు వాయిదా వేసింది.

## సీఎం కేసీఆర్ ఆశయాలు నెరవేర్చాలి : మంత్రులు హరీష్‌రావు, ఎర్రబెల్లి



హైదరాబాద్ : ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్ సుధాకర్ రావు రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖల మంత్రి హరీశ్ రావు, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా తనకు చైర్మన్‌గా నియమించినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. మంత్రులు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆశయాలను నెరవేర్చేలా, ప్రజలకు మరింత సేవ చేసేలా కృషి చేయాలని సుధాకర్ రావుకి సూచించారు. ఆరోగ్య శ్రీ ట్రస్ట్ సేవలను ప్రజలకు సంపూర్ణంగా అందేలా చర్యలు తీసుకోవాలని వారు అభిలాషించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు వంటేరు ప్రతాప్ రెడ్డి, ఆకుల లలిత తదితరులు ఉన్నారు.

## ప్రజా సమస్యలు పట్టని రేవంత్‌ను నిలదీయాలి : మంత్రి మల్లారెడ్డి



శామీర్‌పేట : ప్రజలను నమ్మించి, మోసగించి ఎంపీగా గెలిచిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ప్రజా సమస్యలు పట్టవని , అటువంటి వ్యక్తి ఓట్ల కోసం వస్తే నిలదీయాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శామీర్‌పేట మండలం అలియాబాద్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ ఉపసర్పంచ్ ప్రభాకర్‌రెడ్డితో పాటు మరికొందరు బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మంత్రి మాట్లాడుతూ పనిచేసినోడికే ఓటు అడిగే హక్కు ఉందని ఇచ్చిన మాటను ఎప్పటికప్పుడు నిలబెట్టుకుంటున్న ముఖ్యమంత్రి కేసీఆర్ కే ఆ హక్కు ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానిదే హాట్రిక్ విజయం అన్నారు. గోడల మీద పేర్లు కాదు ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకునే వారే నిజమైన లీడర్ అని పేర్కొన్నారు. మూడు పంటలకు నీళ్లిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ అంటుంటే రేవంత్ 3 గంటల కరెంటు సరిపోతుందని అంటున్నాడని ఎద్దేవా చేశారు. తొమ్మిది సంవత్సరాల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఉండి ప్రజలకు ఏమి చేసిందని ప్రశ్నించారు. సాగునీరుకు కరెంటు ఉండేది కాదని, తాగునీళ్ల కోసం కిలో మీటర్ల దూరం బిందెలతో ఆడపడుచులు వెళ్లేవారని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఊకదంపుడు ఉపన్యాసాలు పక్కన బెట్టి ప్రజాక్షేత్రంలో వచ్చి దమ్ముచూపించాలని సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికల్లో మరిచిపోయి కూడా బీజేపీ, కాంగ్రెస్‌లకు ఓటు వేయవద్దని కోరారు. ఆ పార్టీలకు ఓటేస్తే తెలంగాణ పరిస్థితి అధోగతి అవుతుందని వెల్లడించారు. గృహలక్ష్మి పథకం ఈ నెలలోనే రాబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లూభాయిబాబు, జడ్పీటీసీ అనితలాలయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు కంటం కృష్ణారెడ్డి, తూంకుంట మున్సిపాలిటీ చైర్మన్ కారంగుల రాజేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ వాణివీరారెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షులు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో మరో ముగ్గురు అరెస్ట్




తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీకేజీ కేసులో మరో ముగ్గురు అరెస్టయ్యారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ప్రవీణ్ బంధువులైన ముగ్గురిని సిట్ అరెస్టు చేసింది. తాజా అరెస్టులతో కలిసి పేపర్ లీకేజీ వ్యవహారంలో మొత్తం అరెస్టు అయిన వారి సంఖ్య 99కి పెరిగింది. అరెస్టయిన ముగ్గురు నిందితులు ప్రశ్నపత్రాల లీకేజీకి ప్రవీణ్‌కు సహకరించినట్లు దర్యాప్తులో తేలింది. మరో వైపు ఈ కేసులో ఏ2 రాజశేఖర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌ను నాంపల్లి కోర్టు తిరస్కరించింది. ఇప్పటికే రాజశేఖర్‌రెడ్డి బెయిల్ పిటిషన్ మూడుసార్లు తిరస్కరణకు గురైంది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com